RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 118 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం,అక్టోబర్,29, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 118 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday,October,29,2025 | PAGES : 8 RS : 4 /- |

# సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపై సీఎం సమీక్ష..



## మొంథా ఎఫెక్ట్.. హైదరాబాద్‌లో భారీ వర్షం..

**హైదరాబాద్,అక్టోబర్,28,తెలంగాణ దిశ :** మొంథా తుపాన్ ప్రభావంతో ఏపీతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తెలుగు రాష్ట్రాలపై మొంథా తుపాన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. తుపాన్ ప్రభావంతో ఏపీతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, జర్నలిస్ట్ కాలనీ, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట్‌లో భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయిపోయాయి.

## కాళేశ్వరం బ్యారేజీల రిపేర్లపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు





**హైదరాబాద్,అక్టోబర్,28,తెలంగాణ దిశ :** సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల మరమ్మతుల కు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని, వీటి రిపేర్ల కోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇవాళ నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ రివ్యూ మీటింగ్?లో మంత్రి ఉత్తమ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్‌రాజ్, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ పంపిన లేఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు. లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించిన రేవంత్ రెడ్డి వాటిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. లేఖలో పేర్కొన్న ప్రాజెక్టుల కు సంబంధించి ప్రాజెక్టువారీగా విశ్లేషణలు చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని అన్ని డ్యామ్?లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. ప్రాజెక్టులవారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని సీఎం నిర్ణయించారు. ఈ సమీక్షలో తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన ప్రాజెక్టుపై సీఎం చర్చించారు. తమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.



## మూసీ నది సుందరీకరణ ప్రాజెక్ట్ లో కీలక ముందడుగు

**హైదరాబాద్,అక్టోబర్,28,తెలంగాణ దిశ :** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. మూసీ నది సుందరీకరణ, అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా 734.07 భూమిని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు బదలాయించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ నిర్ణయంతో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్‌పనులు మరింత వేగవంతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బదలాయించే భూములు రంగారెడ్డి జిల్లాలోని నాలుగు మండలాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాయత్ సాగర్ లోని ఈసా నది వద్ద, గండిపేట మండలంలోని కిస్మత్‌పూర్,రాజేంద్రనగర్ మండలంలోని ప్రేమావతి నగర్, బద్వేల్,శంషాబాద్ మండలంలోని కొత్వాల్ గూడలో హెచ్ ఎండీ ఏ లే అవుట్ ల కోసం కేటాయించిన ఈ భూములను బదలాయించారు. మూసీ నది సుందరీక రణతోపాటు రివర్ ఫ్రంట్ కారిడార్ అభివృద్ధిని చేపట్టనుంది రాష్ట్ర ప్రభుత్వం. ఈ క్రమంలో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కు 734.07 ఎకరాల భూమిని బదలాయిస్తూ భూపరిపాలన ప్రధాన కమిషనర్ లోకేశ్ కుమార్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

## 'మొంథా' తుఫాన్ నేపథ్యంలో పత్తి రైతులు

# అప్రమత్తంగా ఉండాలి



**హైదరాబాద్,అక్టోబర్,28,తెలంగాణ దిశ :** 'మొంథా' తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుఅన్నారు. ఆయన సచివాల యంలో 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా ఖమ్మం, మంచిర్యాల, కామారెడ్డి, నల్గొండ, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ రైతులతో మంత్రి తుమ్మల మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. పత్తి తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికీ కొనుగోలు చేయాలని తాము కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ ద్వారా 318 జిన్నింగ్ మిల్లులు నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లకు ప్రారంభించామని అన్నారు. రైతులకు చెందిన 1,623 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేశామని తెలిపారు. పత్తి క్వింటాలు మద్దతు ధర రూ. 8,110 చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. తేమ శాతం విషయంలో పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 'కపాస్ కిసాన్' యాప్‌లో పత్తి రైతులు నమోదు చేసుకుని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలన్నారు. పత్తి కొనుగోళ్లలో సమస్యలంటే రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 5779కు సంప్రదిం చాలని అన్నారు. అదేవిధంగా నేటి నుంచి సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని, ప్రైస్ సపోర్ట్ స్కీమ్‌లో మొక్కజొన్న, జొన్నలు చేర్చాలని సోయాపై ఉన్న పరిమితులు ఎత్తి వేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లుగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

# ప్రజలు సంయమనం పాటించాలి

## కురిక్యాల విద్యార్థినుల లైంగిల వేధింపు ఘటనపై బండి సంజయ్



**కరీంనగర్,అక్టోబర్,28,తెలంగాణ దిశ :** కరీంనగర్ జిల్లా గంగాధర మండల పరిధిలోని కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటపై తాజాగా కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ సందర్భంగా ఇవాళ ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల ఘటనపై ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది పాత్రపై పోలీసుల విచారణ కొనసాగుతోందని అన్నారు. ఇప్పటికే ప్రధాన నిందితుడు అటెండర్ యాకూబ్ బాషా పై పోక్సో కేసు నమోదైందని, ఈ మొత్తం వ్యవహారం అందరి నిర్లక్ష్యం ఉందన్నారు. బాధ్యులపై కూడా అవసమైతే పోక్సో కేసు నమోదు చేయాలని సూచించారు. ఈ ఘటనపై కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో పాటు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సీరియస్‌గా ఉన్నారని పేర్కొన్నారు.ప్రాథమిక విచారణ ఆధారంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. విషయం పిల్లల భవిష్యత్తుతో ముడిపడి ఉందని.. అంతా సమయమనం పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆందోళనలో ఉన్న తల్లిదండ్రులకు భరోసా కల్పించాలన్నారు. ఇక వంగరలో గురుకుల విద్యార్థి ఆత్మహత్యపై ప్రశ్నించగా.. విద్యార్థి మరణం దారుణమని అన్నారు. బీఆర్ఎస్ పాలన తరహాలోనే కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని కామెంట్ చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. ఇక తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సహాయక చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయని తెలిపారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధమని బండి సంజయ్ అన్నారు.

## మొంథా ఎఫెక్ట్.. చెన్నైలో భారీ వర్షం.. నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు



**చెన్నై,అక్టోబర్,28:** ప్రభావంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏపీ, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వానలు పడుతున్నాయి. తాజాగా తమిళనాడు రాజధాని చెన్నై లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ నీటముని గాయి. ప్రధాన రహదారులు నదులను తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలవడనంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నైలో ఈరోజు మధ్యాహ్నం 1 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. చెన్నైతోపాటూ చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట, తిరువళ్లూరు సహా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. కన్యాకుమారి, తెంకాసి, తిరునల్వేలి, తిరువన్నమలై, వెల్లూరు, విలుప్పురంలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మరోవైపు తుఫాను ప్రభావంతో చెన్నైలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. బీచ్‌ల వద్ద కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. తీవ్ర తుఫానుగా రూపాంతరచెందిన మొంథా మరికొన్ని గంటల్లో తీరం దాటనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు 270 కిలోమీటర్ల దూరంలో ఉన్న మొంథా తుఫాను.. మచిలీపట్నం–కాకినాడ మధ్య మంగళవారం సాయంత్రం తీరం దాటే అవకాశం ఉంది.

## ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్స్

# ఉప ఎన్నికలకు నోటిఫికేషన్




**న్యూఢిల్లీ,అక్టోబర్,29:** గత కొంత కాలంలో ఢిల్లీలో ఖాళీగా ఉన్న మున్సిపల్ కౌన్సిలర్ స్థానాల భర్తీపై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉన్న 12 కౌన్సిలర్ స్థానాలను భర్తీ చేయడానికి ఉప ఎన్నికల తేదీలను అధికారికంగా ప్రకటించింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల దాఖలు ప్రారంభం నవంబర్ 3న, నామినేషన్ల దాఖలు చివరి తేదీ నవంబర్ 9, నామినేషన్ల పరిశీలన నవంబర్ 11న, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నవంబర్ 14గా నిర్ణయించారు. ఓటింగ్ నవంబర్ 30న, ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న జరుగనున్నట్లు ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ ఉప ఎన్నికలు ప్రధానంగా గత ఎన్నికల్లో విజయం సాధించిన కొందరు కౌన్సిలర్లు ఎమ్మెల్యేలుగా, ఇతర పదవులకు ఎంపిక కావడంతో ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేయడానికి నిర్వహించబడుతున్నాయి.

ఈ ఎన్నికలు ఉత్తర, దక్షిణ, తూర్పు ఢిల్లీ ప్రాంతాల్లోని వివిధ వార్డులలో జరగనున్నాయి. ప్రతి పార్టీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తక్షణమే అమల్లోకి వచ్చింది. ఎన్నికల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల సిద్ధత వంటి అంశాలపై %వీజణ% మరియు పోలీస్ అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలు రాజధానిలో స్థానిక రాజకీయ సమీకరణాలకు కీలకమైనవిగా భావిస్తున్నారు.

## హరీష్ రావు తండ్రి మృతి...


# కవిత దూరం..!





**హైదరాబాద్,అక్టోబర్,28,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ నేడు ఉదయం అనారోగ్య సమస్యలతో మరణించిన సంగతి తెలిసిందే. గులాబీ అధినేత కేసీఆర్ కుటుంబం తోసహా ఆ పార్టీ ముఖ్య నేతలంతా హరీష్ రావు నివాసానికి చేరుకొని,ఆయన తండ్రికి నివాళులు అర్పించారు. అంతేకాదు సత్యనారాయణ కేసీఆర్‌కు స్వయంగా బావ అవుతారు. కాగా తన మామ పార్థివదేహాన్ని చూడటానికి ఇంతవరకు కల్వకుంట్ల కవిత రాలేదు. అంత్యక్రియలకు హాజరవ్వడం కూడా అనుమానమే అంటున్నారు జాగృతి సభ్యులు. ఇటీవల బీఆర్ఎస్ నాయకులపై ముఖ్యంగా హరీష్ రావుపై కవిత సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలు రెండు కుటుంబాల మధ్య దూరాన్ని పెంచాయి.

# కబ్జాల చెర వీడిన 1.27 ఎకరాల పార్కు.. హైడ్రా విముక్తి




**హైదరాబాద్,అక్టోబర్,28,తెలంగాణ దిశ :** అక్రమ కట్టడాలు కూల్చేవేతే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఆ దిశగా దూసుకుపోతుంది. మంగళవారం నగరంలో వేర్వేరు చోట్ల ఆక్రమణల తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కు కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించింది. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని గ్రహించి ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్‌నగర్ పేరిట 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ చెందినవారు లేఔట్ వేశారు. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావస రాలకు కేటాయించారు. పేదల అవసరాల కోసం కేటాయించబడిన ఈ లేఔట్‌లో బడాబాబు పాగా వేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులు పారదర్శకంగా జవాబులు దారితనంతో పని చేయాలి

### - జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి






**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28, (తెలంగాణ దిశ)** :విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ పై ఉద్యోగులతో పాటు ప్రజలకు అవగాహన కల్పించి అవినీతిని నిరోధించడంలో అందరూ భాగస్వాములు కావాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్ రూరల్ యూనిట్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసర్ పి. శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్త, విజయేందర్ రెడ్డిలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అవగాహన వారోత్సవాల ద్వారా ఉద్యోగులలో, ప్రజలలో పూర్తి అవగాహన కల్పించి అవినీతి, అక్రమాలను నిరోధించాలని అన్నారు. ప్రభుత్వ మార్గ నిర్దేశాల మేరకు విజిలెన్స్ ద్వారా ప్రభుత్వానికి రావలసిన అన్ని రకాల ఆదాయాలకు గండి పడకుండా చూడడం, ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అనవసర ఖర్చు, అవినీతి జరగకుండా, ప్రభుత్వ వనరులు దుర్వినియోగం కాకుండా కాపాడడం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ అన్నారు. విజలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా తమ తమ శాఖలలో క్రింది స్థాయి వరకు ఎక్కడ అవినీతి జరుగకుండా తమ విధులలో పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో వారోత్సవాలు నిర్వహించాలని సూచించారు ఇందులో భాగంగా స్కూళ్లలో క్విజ్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్ని విభాగాలు కూడా ఈ కార్యకలాపాలను చేపట్టి ఫోటోలు పంపాలన్నారు. ప్రతి డిపార్ట్ మెంట్ నుండి ప్రజలకు ఏఏ సేవలు అందిస్తారనే అంశాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడిగిన సమాచారాన్ని ఏలాంటి సమస్యలు లేకుండా అందించాలన్నారు. విధి నిర్వహాణలో ఏలాంటి వత్తిళ్లకు గురికాకుండా నిజాయితీగా సేవలందించాలన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఆఫీసర్ పాల్వాయి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వ అధికారులందరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ నిధులు దారి మళ్లకుండా, అనవసరపు నిర్మాణాలు, ఖర్చులు జరుగకుండా, అవినీతిని నిరోధించడంమే విజిలెన్స్ ప్రధాన లక్షమని అన్నారు. విజిలెన్స్ డిపార్ట్ మెంట్ కు ప్రతి డిపార్ట్ మెంట్ సహాయ సహకారాలు అందించాలన్నారు. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తూ అవినీతి రహిత సమాజానికి తోడ్పడాలన్నారు. విజిలెన్స్ శాఖ వారు ప్రారంభించిన టోల్ ఫ్రీ నెం.14432 ను ప్రజలందరూ వినియోగించుకొని అవినీతి సమాచారాన్ని అందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఉద్యోగులు, సిబ్బందితో విజిలెన్స్ పరిపాలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, విజిలెన్స్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమిలో మద్యం ప్రకంపనలు..!

**తిరుపతి,తెలంగాణ దిశ :** ఏపీలో నకిలీ మద్యం ప్రకంపనలు సృష్టించి ంది. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం లో నకిలీ మద్యం శిబిరం వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ అధికారుల తనిఖీలో బయటపడింది. ఈ నకిలీ మద్యం తయారీలో సంబంధం ఉన్నట్టు ఆరోపణలు రావడంతో తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ జయ చంద్రారెడ్డి పై పార్టీ వేటు వేసింది. మరో నేతపై కూడా టిడిపి హై కమాండ్ చర్యలు తీసుకుంది. అయితే దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అస్త్రంగా మార్చుకుంది. అయితే నకిలీ మద్యం పై ఆరోపణలు వచ్చిన వెంటనే తాము చర్యలు తీసుకున్నామని.. ఈ నిందితులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో ముందస్తు ఒప్పందం కుదిరింది అన్న అనుమానాలు ఉన్నాయి. అయితే ఇవేవీ పట్టించుకోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అదే పనిగా ప్రచారం చేస్తోంది. అయితే దీనిపై కేవలం టిడిపి నేతలు కౌంటర్ ఇస్తున్నారు. బిజెపితో పాటు జనసేన నేతలు స్పందించకపోవడం కూటమిలో ఉన్న గ్యాప్ ను తెలియజేస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది మూడు పార్టీల మధ్య సమన్వయం బాగానే నడిచింది. ఇది ఉమ్మడి ప్రభుత్వం కావడంతో ఏ పార్టీపై రాజకీయంగా విమర్శలు వచ్చినా.. తిప్పి కొట్టాల్సిన అవసరం మూడు పార్టీలపై ఉంది. గతంలో చాలా పరిణామాల విషయంలో మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాయి. కానీ ఇప్పుడు నకిలీ మద్యం వ్యవహారంలో మాత్రం తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ దానిని అడ్డుకోవడంలో కేవలం తెలుగుదేశం మాత్రమే ముందుంటోంది. ఈ విషయంలో బిజెపితో పాటు జనసేన నేతలు పెద్దగా కలుగజేసుకోవడం లేదు. దీనిని ఛాన్స్ గా తీసుకుంటోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అదే పనిగా టిడిపి పై వ్యతిరేక ప్రచారం చేస్తోంది కూటమి మరో 15 ఏళ్ల పాటు కొనసాగాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బలంగా కోరుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సూచిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. కూటమిలో తాము ఉన్నామన్న విషయాన్ని మూడు పార్టీలు మరిచిపోతున్నాయి.

# నిజాంపేట కార్పొరేషన్ చెత్త సేకరణ కార్మికులకు అండగా బిజెపి

### - ఒకప్పుడు ఆదర్శ కార్పొరేషన్.., ప్రస్తుతం చెత్త మాఫియా కార్పొరేషన్





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 28, (తెలంగాణ దిశ)**నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ చెత్త మాఫియా కార్పొరేషన్ గా తయారయిందని బిజెపి నిజాంపేట్ మున్సిపల్ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ ఆరోపించారు. చెత్త సేకరణ వాహనదారులు ఒక్కొక్క ప్లాటు నుండి రూ. రెండు అదనంగా వసూలు చేసి కాంట్రాక్టర్ లేదా ఏజెన్సీకి ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం బిజెపి బృందం చెత్త డంపింగ్ యార్డ్ ను సందర్శించింది. అనంతరం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పై వచ్చిన ఆరోపణల విషయంలో వివరణ కోరారు ఈ సందర్భంగా బిక్షపతి యాదవ్ మాట్లాడుతూ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లో చెత్త సేకరణలో ప్రామాణికవైన విధానాన్ని ఎందుకు అవలంబించడం లేదని ప్రశ్నించారు. దొంగచాటుగా ఒక ఏజెన్సీకి అప్పగించి వారి ద్వారా డబ్బులు వసూలు చేయడం ఏమిటని నిలదీశారు. ఏజెన్సీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పందించిన కమిషనర్ రూ. రెండు వందలు తీసుకుంటున్న వారిపై చర్యలు తీసుకుంటామని, అదే విధంగా ఏజెన్సీని రద్దు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీనితో పాటుగా నిజాంపేటలో ఉన్న 150 చెత్త సేకరణ బండ్లలలో దాదాపు 35 బండ్లకు మాత్రమే జియో ట్యాగింగ్ ఉందన్నారు. మిగిలిన వాహనాలకు జియో ట్యాగింగ్ లేకపోవడం వల్ల అవి ఎక్కడ తిరుగుతున్నాయో తెలియడం లేదని, వెంటనే జియో ట్యాగింగ్ ఏర్పాటు చేయడంతోపాటు చెత్త సేకరించే కార్మికులకు ఐడి కార్డులు సేఫ్టీ మేజర్స్ అందజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈ శ్రమ కార్డు ద్వారా ఐదు లక్షల ఇన్సూరెన్స్ కూడా అందించాలని కోరారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్తంగా నూతనంగా ఎవరైనా చెత్త సేకరించే కార్మికుడు నూతన వాహనం కావాలంటే 50 శాతం సబ్సిడీతో వాహనాన్ని కూడా అందిస్తుందని, వీటి అన్నిటిని లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి దాసి నాగరాజు, నిజం పేట జనరల్ సెక్రెటరీ సచిన్, బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయం

### - కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్



**ఏఎస్ రావు నగర్, అక్టోబర్ 28, (తెలంగాణ దిశ)** :జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ విజయం ఖాయమని కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెబుతున్న బిఆర్ఎస్ నేతలను స్థానికులు విశ్వసించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను క్రమంగా అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. అదేవిధంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్ అందజేస్తుందన్నారు. అదే విధంగా రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాని దేనన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. అధికారంలో ఉన్నప్పుడు చిన్న శ్రీశైలం యాదవ్ ను బిఆర్ఎస్ పార్టీలో కొనసాగినప్పుడు రౌడీషీటర్ గా కనిపించలేదా అని ఆయన ప్రశ్నించారు. నిత్యం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే నవీన్ యాదవ్ కు జూబ్లీహిల్స్ ప్రజలు నీరాజనం పడుతున్నారని తెలిపారు. ఓటమి తప్పదని భావించిన బిఆర్ఎస్ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముదిగొండ లింగస్వామి, భద్రగామ నరసింహులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణ కోసం సర్వస్వాన్ని త్యాగం చేస్తున్న పోలీసులు

### - విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం
### - రాచకొండ కమిషనరేట్ మల్కాజిగిరి జోన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ





**కుషాయిగూడ, అక్టోబర్ 28, (తెలంగాణ దిశ)** :విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రాచకొండ పోలీస్ కమిషనరేట్ మల్కాజిగిరి జోన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కుషాయిగూడ జవహర్ నగర్, నేరేడ్ మెట్, చర్లపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలీస్ సిబ్బందితోపాటు వివిధ ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలకు చెందిన వందలాదిమంది విద్యార్థులు రాధిక చౌరస్తాలో మానవ హారంగా ఏర్పడి పోలీసు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ అమర వీరులకు జోహార్ జోహార్..., మీ ఆశయాలను సాధిస్తామంటూ దిక్కులు పిక్కటిల్లేలా నిలదించారు. ఈ సందర్భంగా అమర పోలీసు కుటుంబాలకు ఘనమైన నివాళులర్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రజా సంరక్షణలో భాగంగా వేలాదిమంది పోలీసులు ప్రాణాలను బలిదానం చేశారన్నారు. ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసులు, ప్రజలు అండగా నిలుస్తూ మనోధైర్యాన్ని నింపుతున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఏసిపి వెంకట్ రెడ్డి, కుషాయిగూడ నేరేడ్ మెట్, జవహర్ నగర్, చర్లపల్లి పోలీస్ స్టేషన్ల సర్కిల్ ఇన్ స్పెక్టర్లు ఎల్. భాస్కర్ రెడ్డి, సందీప్, సైదయ్య, సుధాకర్, ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్లు లక్ష్మణరాజు, వెంకన్న, శ్రీనివాస్, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అన్నపూర్ణాదేవికి అష్టోత్తర శత 108 కలశ స్నపన పూజ





**నాగారం, అక్టోబర్ 28, (తెలంగాణ దిశ)** :నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ వి నగర్ రోడ్ నెంబర్ 8 లో శ్రీ లక్ష్మీ గణపతి అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం శ్రీ అన్నపూర్ణాదేవికి అష్టోత్తర శత 108 కలశ స్నపన పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మూల మంత్ర హెూమం, రుద్రాభిషేకం, చండీ పారాయణ, ధాన్యాధివాసాంగ హెూమాలు, విశ్వావసు గంధర్వ హెూమం, మూల మంత్ర హెూమం, రుద్రహెూమం, చండీ హెూమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయంలో శ్రీ కోదండ రామాంజనేయ స్వామి, శ్రీ వల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి, నాగబంధ, మృత్యుంజయ, మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఎంవిఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుబ్రహ్మణ్య శర్మ సహాయకులు జమ్మలమడక శ్రీరమణ శర్మ, ఆలయ అధ్యక్షులు దాచా శ్రీనివాస్ గుప్తా ఎర్రం ఈశ్వరయ్య గుప్త, లింగా నాగేంద్రగుప్త, పీవీవీ. సత్యనారాయణ నరసింహస్వామి గౌడ్, గంగిరెడ్డి నరేందర్ రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వరావు, వి. నర్సింహాస్వామి గౌడ్, ఆంజనేయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



# పోలీసుల సేవలు వెలకట్టలేనివి...,

### - విద్యార్థులతో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు
### - ర్యాలీలో పాల్గొన్న సీఐ ఆంజనేయులు






**కీసర, అక్టోబర్ 28, (తెలంగాణ దిశ)** :కీసర పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం కీసర పరిధిలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలతో పాటు కీసర పరిధిలోని కళాశాలల విద్యార్థులతో ప్రధాన చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కీసర పోలీసులు సీఐ ఆంజనేయులు, సబ్ ఇన్ స్పెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించారు. అమరులైన పోలీస్ సిబ్బందితోపాటు కుటుంబ సభ్యులకు ఇవే మా వందనమంటూ.. పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సహితం అర్పించిన పోలీస్ అమరవీరులకు జోహార్ జోహార్ అంటూ..జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, స్ఫూర్తి డిగ్రీ కళాశాల లెక్చరర్లు, స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు: కమిషనర్లు

కమాన్ పూర్: జాప్యం లేకుండా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలనుఉద్యోగులకుఅందించేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్లు హరిపచౌరి, డా: కె.గోవర్ధన్ లు అన్నారు. మంగళవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీ ఆర్ జి 3 జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికా రులు, ఉద్యోగులతో "ప్రయాస్" పై అవగాణ కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగింది.ముందుగా కమిషనర్ ఎన్ సి డబ్యు ఎ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 355 పిపిఓ ఆర్డర్స్ ను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు కు అందజేశారు.ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి మాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావాదేవీలు అన్ని సి-కేర్స్ ( సి-సిఏఆర్ ఈఎస్) పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు.సిఎంపిఎఫ్ క్లెయిమ్స్, రివైజ్డ్ పెన్షన్ పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

# సంపాదకీయం

## ఇండియా, చైనా సంబంధాలు కొత్త దారి ?

భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల భారం అమల్లోకి వచ్చిన కొన్ని గంటల తర్వాత భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాలో అడుగు పెట్టారు.ప్రస్తుతం భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వజ్రాలు, రొయ్యలు వంటి వాటిపై 50శాతం సుంకం చెల్లించాల్సి ఉంది.రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు భారత్‌కు ఈ శిక్ష విధించినట్లు ట్రంప్ చెబుతున్నారు.భారత ఎగుమతుల లక్ష్యాలపై ట్రంప్ సుంకాలు బలమైన శాశ్వత గాయాలను మిగిల్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.ఇలాంటి పరిస్థితుల మధ్య ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాల నాయకులు తమ మధ్య వాణిజ్య సంబంధాల పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నారు.అయితే గతంలో ఈ రెండు దేశాల మధ్య సంబంధాల్లో అపనమ్మకం, సరిహద్దు వివాదాలు కీలకంగా ఉన్నాయి.సింపుల్‌గా చెప్పాలంటే, ఈ రెండు దేశాల సంబంధాల్లో ఏం జరుగుతుందనేది ప్రపంచ దేశాలకు ఆసక్తికరంగా మారింది.అమెరికా, పశ్చిమ దేశాలు భావిస్తున్నట్లు చైనాకు వ్యతిరేకంగా భారత్ ఎన్నటికీ ఒక రక్షణ కవచంగా ఉండదు. మోదీ పర్యటన కీలక మలుపును సూచిస్తుంది" అని ఆయన ఆ వ్యాసంలో పేర్కొన్నారు.భారత్, చైనా ప్రపంచ ఆర్థిక శక్తులు. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో చైనా రెండో స్థానంలో, భారత్ ఐదో స్థానంలో ఉన్నాయి.అయితే భారత్ సాధిస్తున్న 6 శాతం వృద్ధి రేటు, 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 5 ట్రిలియన్ డాలర్ల స్టాక్ మార్కెట్ లాంటి అంశాలు భారత్ 2028కల్లా ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది ప్రపంచంలో అతి పెద్ద రెండు ఆర్థిక వ్యవస్థలైన అమెరికా చైనా ఎలా కలిసి పని చేస్తాయా అని చూస్తున్నప్పుడు.. రెండు, మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిసి ఎలా పని చేస్తాయా అని చూడాల్సిన సమయం వచ్చింది" అని బీజింగ్‌లోని ఉసావా అడ్వైజరీ వ్యవస్థాపకుడు కియాన్ లియు అన్నారు.అయితే ఈ రెండు దేశాల సంబంధాల్లో అనేక సవాళు ఉన్నాయి.2020 జూన్‌లో గాల్వాన్ లోయలో హింసాత్మక సంఘర్షణ, రెండు దేశాల సంబంధాలను గతంలో ఎన్నడూ లేనంత క్షీణ దశకు చేర్చింది.ఇది ఆర్థిక సంబంధాల మీదనే ఎక్కువ ప్రభావం చూపింది. రెండు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాల రాకపోకల్ని నిలిపివేయడం, వీసాలు, పెట్టుబడులు ఆపేయడంతో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం మందగించింది. టిక్‌టాక్ సహా చైనాకు చెందిన 200కి పైగా యాప్‌లను భారత్ నిషేధించింది.పశ్చిమ దేశాల ఆలోచనలకు భిన్నమైన ప్రపంచ దృష్టి కోణాన్ని ప్రదర్శిస్తోన్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో పాల్గొనేందుకు మోదీ చైనా వెళ్లారు. ఇందులో భారత్‌తో పాటు చైనా, పాకిస్తాన్, ఇరాన్, రష్యా సభ్య దేశాలు.గతంలో భారత్ ఈ సంస్థ ప్రాధాన్యాన్ని తక్కువగా అంచనా వేసింది.ఈ సంస్థ కొన్నేళ్ల వరకు గుర్తించదగిన ఫలితాలేవీ సాధించలేదని విమర్శకులు చెబుతున్నారు.2025 జూన్‌లో జరిగిన ఎస్‌సీఓ రక్షణ మంత్రుల సమావేశంలో ఉమ్మడి ప్రకటనపై ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ ప్రకటనలో పహల్గాంలో తీవ్రవాదుల దాడిపై ఎటువంటి ప్రస్తావన లేకపోవడంతో భారత్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది.అయితే దిల్లీ, వాషింగ్టన్ మధ్య సంబంధాలు క్షీణించడంతో భారత్ మళ్లీ షాంఘై సహకార సంస్థ ప్రాధాన్యాన్ని గుర్తించేలా చేసిందని నిపుణులు చెబుతున్నారు.అదే సమయంలో ట్రంప్ సుంకాల దాడితో ఆసియాన్ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాల ప్రాధాన్యాన్ని చైనా గుర్తించింది.2024 అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మోదీ చివరిసారిగా జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్‌లను కలిశారు. త్వరలో చైనా, భారత్‌తో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు రష్యన్ రాయబార కార్యాలయ అధికారులు తెలిపారు.చైనా తయారీ నైపుణ్యం, భారత్ సేవా రంగ బలాలు, రష్యా సహజ వనరులనుఉపయోగించుకోవడం ద్వారా ఈ మూడు దేశాలు అమెరికాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు" అని బాజపేయి తన వ్యాసంలో రాశారు. భారత్ ఉత్పత్తి, తయారీ రంగంలో చైనా మీద ఆధారపడుతోంది. ఎందుకంటే భారత్‌లో తయారవుతున్న అనేక వస్తువుల ముడి పదార్థాలు చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఆ వస్తువుల మీద దిగుమతి సుంకాలు తక్కువగా ఉండాలని భారత్ ఆశిస్తోంది.చైనా సరఫరా వ్యవస్థలతో ఆగ్నేయాసియా దేశాలు పొందుతున్న ప్రయోజనాలను పొందడంలో భారత్ అనుసరిస్తున్న కఠిన పారిశ్రామిక విధానాలు అడ్డంకిగా మారాయని నిపుణులు చెబుతున్నారు.చైనాతో భారత్ భాగస్వామ్యం కోరుకోవడంలో బలమైన కారణం ఉందని, భారత్ మరిన్ని ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రయత్నిస్తోందని ఆసియా డీకోడెడ్ పరిశోధన సంస్థ వ్యవస్థాపకురాలు ప్రియాంక కిషోర్ అన్నారు.చైనా నుంచి వచ్చే వీసా అభ్యర్థనలను భారత్ త్వరగా ఆమోదించాలి. అప్పుడే ఇది చైనాకు సులభమైన విజయం అవుతుంది. ప్రత్యక్షంగా లేదా పెట్టుబడుల ద్వారా భారత మార్కెట్లలోకి ప్రవేశించాలని చైనా భావిస్తోంది. ఇదే జరిగితే భారత్‌లో తగ్గుతున్న అమెరికన్ పెట్టుబడుల లోటును పూడ్చుకోవచ్చు" అని ప్రియాంక కిషోర్ అభిప్రాయపడ్డారు."140 కోట్ల మందికి తమ ఉత్పత్తులను అమ్మే అవకాశాన్ని బీజింగ్ స్వాగతిస్తుంది" అని ఆమె చెప్పారు.రెండు దేశాల మధ్య సంబంధాల్లో ఉన్న సంక్లిష్టత దృష్ట్యా ఒక్క సమావేశంలోనే ఏదో అద్భుతం జరిగే అవకాశం లేదు. అలాంటి అద్భుతం కోసఈ రెండు దేశాలు ఇంకా చాలా దూరం ప్రయాణిం చాలి. అయితే చైనాలో మోదీ పర్యటన అందుకు అవసరమైన ప్రారంభాన్ని అందిస్తుంది. అంతే కాకుండా భారత్‌కు ప్రత్యామ్నా యాలు ఉన్నాయనే సంకేతాన్ని వాషింగ్టన్‌కు పంపిస్తుంది.

# చెరగని కవితా ఝరి



తెలుగు కవిత సృజన ప్రపంచంలోకి ఎన్.అరుణ 'మౌనమూ మాట్లాడుతుంది' అనే కవితా సంపుటితో ప్రవేశించడంనాటి సాహితీ లోకంలో ఒక ఆశ్చర్యం. విద్యార్థి దశలోనే సాహితీ సృజన చేసినా కుటుంబ బాధ్యతలకు అంకితమై నిశబ్దంగా ఉన్న అరుణ ఒక్కసారిగా కవిత్వాన్ని వెల్లువలా సృష్టించి వచన కవితా చరిత్రలో తనదైన స్థానాన్ని అందుకున్నారు. అగ్నిపర్వతం బద్దలైతే ప్రమాదకరమైన లావా వెలువడుతుంది. అరుణ హృదయం బద్దలై కవిత్వ పరిమళ ప్రవాహం లోకాన్ని ముంచెత్తింది. మౌనం కొత్త వర్ణమాలను సృష్టించుకొని, సరికొత్త వ్యాకరణాన్ని అల్లుకొని మాట్లాడిన మాటలు పాఠకలోకంలో వినూత్న అనుభూతులను, ఆలోచనలను ఆవిష్కరించాయి.

**'నన్ను నేనెప్పుడూ వెతుక్కుంటూనే ఉంటాను/ మనస్సు నిండా చిన్న చిన్న శూన్యాలుంటాయి/ ఆ శూన్యాలకు భాష్యమే మౌనం' అంటూ అరుణ మానవ లోకంలో అలుముకున్న శూన్యానికి తాత్విక కవితా భాష్యాన్ని పునర్‌లిఖించారు.**

లౌకిక వ్యవహారాలను వదిలించుకొని, జీవిత రహస్యాలని అవగతం చేసుకొని, కాలం చేసే మార్మికతలను ఛేదించుకొని పరిణత మనసుతో నిండిన వ్యక్తిత్వంతో జీవన సౌందర్యాన్వేషణలో ఒక్కొక్కరు ఒక్కో తీరానికి చేరుకుంటారు. సృజనాత్మకశీలి అరుణ కూడా కవితాత్మక తీరానికి ఆలస్యంగానైనా చేరుకోవడం సహజమైన పరిణామమే. 'లోకానికి అక్షరాలు అప్పుపడ్డాను/ అందుకే కవిత్వం రాస్తున్నా', 'ఋణశేషం నాకిష్టం లేని పని/ అందుకే నన్ను నేను అక్షరంగా మలచుకుంటున్నా'నంటూ విశిష్టమైన వస్తుశిల్పాలతో బలమైన వచన కవితా స్వరంగా శాశ్వత స్థానాన్ని పొందిన కవయిత్రి అరుణ.

దశాబ్ద కాలంలో ఎనిమిది కవితా సంపుటాలు సృజించటం సామాన్యమైన విషయం కాదు. 'మౌనమూ మాట్లాడుతుంది'తో మొదలైన కవితాపథం 'పాటల చెట్టు'గా మారి గుప్పెడు గింజల్ని వెదజల్లుతూ 'అమ్మ ఒక మనిషి' అని నిరూపిస్తూ 'హృదయమే వదనం'గా ఆవిష్కృతమై 'సూది నా జీవన సూత్రం' అంటూ తన కవిత్వంలోని అంత స్సూత్రాలను ప్రకటిస్తూ 'కొన్ని తీగలు కొన్ని రాగాలు'గా తన కవితా స్వరాన్ని పాఠక హృదయాల్లో ప్రతిధ్వనించేలా పలకరించారు.

బంగారం అనే ఒక లోహంపై ఈ మనుషుల మోహాన్ని ఎంత ఘాటు గా విమర్శించారో చూడండి.'ఇది స్త్రీ హృదయ సౌందర్యాన్ని/ కప్పేసే కాలమేఘం భావనలను గాయపరిచే/ కన్నీటి లోహం/ ఇది మగవాడి ప్రేమ కాదు/రసికత ఇచ్చే కానుక /ఆడదాని బానిసత్వానికి ప్రతీక' అంటూ నలుగురిలోకి వెళ్లినప్పుడు వ్యక్తి సంస్కారాన్ని, జ్ఞానాన్ని కొలమానాలుగా కాకుండా కేవలం లోహాభరణాలతో విలువ కట్టే సమాజంలో బంగారం ధర విపరీతంగా పెరిగితేనన్నా అది జీవితాల్లోంచి అదృశ్యమై మనిషి విలువ తెలుస్తుందని కవయిత్రి ఆకాంక్షించారు. ఆమె ఆకాంక్ష బలపడుతున్న సందర్భంలో అరుణ అదృశ్యమైపోవడం తీరని విషాదం. కవిత్వం-వ్యక్తిత్వం రెండూ తూర్పు పడమరల్లా వేర్వేరుగా ఉన్న కాలంలో అరుణ వ్యక్తిత్వం కవిత్వంలో ఉషోదయమంత వాస్తవికంగా దార్శనికతతో వ్యక్తమవడం విశేషం. అరుణ అమ్మ 'ఒక మనిషి' వారి కవితా దృక్పథానికి ప్రతీక. అమ్మను లేదా స్త్రీని అక్షరాల్లో ఆకాశమంత ఎత్తుకు వర్ణిస్తూ ఆమె ఒక మహాకావ్యమని ప్రశంసించే లోకానికి తీవ్రమైన హెచ్చరిక చేస్తారు. 'అమ్మ గురించి/ కవిత్వం రాయకండి మిత్రులారా!' అని వారిస్తూ 'గోరుముద్దలు గుర్తున్నాయి గాని/ ఇవ్వాళ ఆమెకో ముద్దపడేస్తున్నారా?' అని సూటిగా ప్రశ్నిస్తారు. అందుకే 'అమ్మను/ దేవతను చేయకండి మిత్రులారా/ మనిషిగా గుర్తిస్తే చాలు' అంటారు. అరుణ వాక్యం వారి లాగానే నిరాడంబరంగా వెలిగిపోయింది. వస్తువేదైనా దాన్ని కవిత్వంతో నింపారు. మూలాలను మరిచిపోకుండా తనను తాను అక్షరాల్లోకి అనువదించుకొని సాంత్వన పొందారు. అందువల్లే వారి కవితాక్షరాలు తామరాకు మీద నీటిబొట్టులా తాత్వికంగా పలకరించాయి. అంతలోనే అవి మన మనసులోకి జారిపడి ముత్యాల్లా మారిపోయి మిల మిలలాడుతూ జీవిత అర్థాలను విప్పి చెప్పాయి. అందుకే, అరుణ విశ్రాంత వర్గ కవి కాదు. 'వచ్చేటప్పుడు ఏం వెంట తెచ్చానో తెలియదు/ పోయేటప్పుడు ఏం తీసుకెళ్తానో కూడా తెలియదు/ ఈ అనుభవాలు, జ్ఞాపకాలే కదా జీవితం' అంటూ అరుణ సాహితీ అభిమానుల్లో ఒక చెరగని కవితా జ్ఞాపకంగా నిత్యం వెలుగులీనుతుంటారు.

# తెలంగాణ పత్తి చేలలో ఆంధ్రా కూలీల మకాం..



**మర్రిగూడ,తెలంగాణ దిశ :** ప్రకృతి వైపరీత్యాల కారణంగా అకాలముగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంత రైతులు తెల్లబంగారం పండిస్తున్న వారికి నిత్యం కురుస్తున్న వర్షాలకు ముచ్చెమటలు పడుతున్నాయి. మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో 90% మెట్ట ప్రాంత రైతులు వర్షాధార పంటలైన తెల్ల బంగారం పండిస్తున్నారు. పత్తి ఏరుకునే సమయానికి నిత్యం కురుస్తున్న వర్షాలతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. దీంతో కొంతమంది రైతులు కలిసి పత్తి ఏరడానికి కూలీలు దొరకక జిల్లా సరిహద్దులు దాటి ఆంధ్ర కూలీలను తీసుకువచ్చారు. ఒక్క నాంపల్లి మండలంలోనే 3000 పైచిలుకు ఆంధ్ర వలస కూలీలు వచ్చి ఆయా గ్రామాల్లో గుడారాలు వేసుకొనిపత్తి ఏరుతున్నారు.మర్రిగూడ మండ లంలో సైతం సరంపేట, లెంకలపల్లి, దామెర భీమనపల్లి, నామాపు రం, ఇందుర్తి, కమ్మగూడెం గ్రామాలలో మోతుబరి రైతులు గుంపులు గుంపులుగాతీసుకువచ్చి తన వ్యవసాయపొలంలోనే గుడారాలు వేసి వాళ్లకు కావాల్సిన నిత్యావసరాలు సరఫరా చేస్తూ పత్తి ఏరించుకుంటు న్నారు. ఏదో రకంగా పత్తిని ఏరుకునే సమయానికి ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో రైతులే కిలో పత్తికి కూలి రేట్లు పెంచేశారు. వలస కూలీలకు నిత్యావసరాలు సరఫరా చేయలేక రైతన్నలు ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఒకప్పుడు తెలంగాణలో పూట గడవక కూలీలు ఆంధ్రాకు వలస వెళ్లిన రోజులు. కానీ ప్రస్తుతం బండ్లు ఓడలవుతాయి ఓడలు మేడలు అవుతాయి అన్న చందంగా ఆంధ్ర వలస కూలీలు తెలంగాణలో ఆయా గ్రామాల్లో వేల మంది కూలీలు వచ్చి పత్తి ఏరుతూ జీవనం గడుపుతున్నారు. పత్తిని త్వరగా ఏరడానికి రైతులు కిలోకు 15 రూపాయలు చెల్లిస్తున్నారు. దీంతో కూలీలు వ్యవసాయ క్షేత్రంలోనే గుడారాలు వేసుకొని లేవగానే పత్తి చేలలో ఉంటూ ఒక్కొక్క కూలి రోజువారీగా 70,80 కిలోలు ఆర్థికంగా లాభపడుతున్నారు. ఏది ఏమైనా అకాల వర్షం రైతన్నలను నిండా ముంచుతున్న పూర్తిగా ఆర్థిక నష్టాల్లో కూరుకుపోకుండా అధికంగా కూలీ చెల్లిస్తూ పత్తి ఏరిస్తూ రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోతున్నారు. ఉదయం లేవగానే పత్తి చేలల్లో కూలీలు..: ఆంధ్రా నుండి వలస వచ్చిన కూలీలు నాంపల్లి మండలంలోని లింగోటం, వడ్డేపల్లి, చిట్టెంపాడు, గానుగు వెల్లి, ముష్టి పెల్లి, రేవెల్లి, పసునూరు గ్రామాలలో సుమారు 3000 పైచిలుకు వలస కూలీలు మోతుబరి రైతు వ్యవసాయ క్షేత్రంలో గుడారాలు వేసుకుని తెల్లవారగానే పత్తి చేలల్లో పత్తిని ఏరుతూ సాయంత్రం వరకు పత్తి చేలల్లో ఉండి పత్తిని ఏరుతున్నారు. రోజువారీగా ఒక్కొక్క కూలీ 70 కిలోల నుంచి 80 కిలోల వరకు పత్తి ఏరుతున్నారు. ఒక్కొక్క గ్రామంలో ఆంధ్రా నుంచి తీసుకొచ్చిన రైతులు ప్రతి గుంపుకు 20వేల నుండి 50 వేల వరకు అడ్వాన్సులు ఇచ్చి రావడానికి ఖర్చులు పెట్టి వాహనాల ఖర్చులు సైతం భరించి కూలీలను తీసుకువచ్చారు. కూలీలను తీసుకు వచ్చేటప్పుడు గుంపు మేస్త్రి తో మాట్లాడి వచ్చే ఖర్చులు నావైతే పోయే ఖర్చులు మీవని మాట్లాడుకుని రాత్రిపూట మంచి చెడులు చూసుకునే విధంగా మాట్లాడుకుని కూలీలను తీసుకువచ్చినట్లు ఒక మేస్త్రీ దిశకు తెలిపారు.

లోకల్ కూలీలకు దొరకని పనులు..: ఆంధ్ర వలస కూలీలు ఆయా గ్రామాల్లో తిష్ట వేయడంతో లోకల్ కూలీలకు కూలీ దొరకడం లేదు. పత్తి ఏరివేతకు ఆయా గ్రామాల్లో ఇక్కడి కూలీలకు పనులు దొరకక కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. నాంపల్లి మర్రిగూడ మండలాల్లోని గ్రామాల్లో వేలాదిగా వచ్చిన కూలీలు వ్యవసాయ భూముల వద్ద గుడారాలు వేసుకొని ఉదయం లేచిన దగ్గర నుండి సాయంత్రం వరకు పత్తులు ఏరడంతో ఇక్కడి కూలీలకు కూలీ దొరకడం లేదు. ప్రతి రైతు సైతం మేస్త్రితో మాట్లాడి అడ్వాన్స్‌గా డబ్బులు ఇచ్చి పత్తి ఏరించుకుంటున్నారు. ఆంధ్ర కూలీలు రావడంతో ఇక్కడి రోజువారీ కూలీలకు కూలీ దొరకక పూట గడవని పరిస్థితి నెలకొంది.

కిలోకు 15 నుండి 18 వరకు చెల్లింపు..: ప్రకృతి వైపరీత్యాల కారణంగా వచ్చే వర్షాలకు అన్నదాతలు పత్తి ఏరించడానికి ఎంతైనా చెల్లించడానికి సిద్ధపడ్డారు. గ్రామాల్లో మోతుబరి రైతులు కొందరు కలిసి ఆంధ్రకు వెళ్లి దళారులతో కూలీలను మాట్లాడుకుని తీసుకువచ్చారు. కిలో పత్తి ఏరడానికి 15 నుంచి 18 రూపాయలు చెల్లించే విధంగా మాట్లాడుకుని పత్తిని ఏరించుకుంటున్నారు. ఎక్కువ మొత్తంలో గిట్టుబాటు అవుతుండడంతో కూలీలు లేచిన దగ్గరనుంచి చీకటి పడే వరకు పత్తి చేలలో ఉండి పత్తి ఏరుతున్నారు. ఒక్కో కూలీ రోజువారీగా 70 కిలోల నుంచి 80 కిలోలు ఏరుతున్నారు. వర్షాల కారణంగా కిలో పత్తి రైతులే 15 నుంచి 18 రూపాయల వరకు పెంచి ఏరించుకుంటున్నారు. ఆర్థికంగా నష్టపోతున్న రైతులు ఇబ్బందులు పడుతుండగా ఆంధ్ర కూలీలు ఆర్థికంగా లాభపడుతున్నారు. ఆంధ్ర కూలీలు ఇక్కడికి వచ్చి పత్తి ఏరడంతో ఇక్కడి కూలీలకు పూట గడవక గగ్గోలు పెడుతున్నారు.

# శాంతి కాముకులు ట్రంప్ లాగా ఉండరు..!

ప్రపంచ ప్రజలు ఎవరు కూడా యుద్దాలను కోరుకోవడం లేదు. ఘర్షణలను ఆహ్వానించడం లేదు. ప్రశాంతంగా బతకాలని కోరుకుంటున్నారు. ఇస్లామిక్ ఉగ్రవాదులు తప్ప మిగతా ప్రపంచమంతా ఇదే కోరుకుంటోంది. ఈ క్రమంలో కేవలం ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి కోసమే ట్రంప్ ప్రయత్నించడం వెర్రితనం తప్ప మరోటి కాదు. వాణిజ్య సుంకాలతో ప్రజలను అస్థిరంలోకి నెట్టిన ట్రంప్ ఎప్పిటకీ శాంతి కాముకుడు కాదు. బలవంతంగా గాజా, హమాస్ మధ్య శాంతి కుదిరినా అది ట్రంప్ ఖాతాలో వేయలేం. తనను తాను శాంతిదూత అని చెప్పుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కేవలం నోబెల్ ప్రైజ్ కోసమే విన్యాసాలు చేస్తున్నారు. యుద్ధాలే కాదు..ఆర్థిక యుద్దాలు కూడా యుద్ధం కిందకే వస్తాయని ట్రంప్ తెలుసుకోవాలి. భారత్, పాక్ యుద్ధం సహా ఏడు యుద్దాలు ఆపానని, ఈ ఏడాది తనకు నోబెల్ బహుమతి రావలని, లేదంటే అమెరికాను అవమానించినట్లేనని బెదిరింపులకు దిగుతున్నారు. అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే తనకు పీస్ ప్రైజ్ ఎందుకు దక్కదంటూ, తాను అన్ని విధాల అర్హుడినని ప్రకటిస్తూ వస్తున్నారు. ఈ ఏడాదికి నోబెల్ బహుమతుల ప్రకటన మొదలైన తర్వాత ట్రంప్ మరింత బలంగా డిమాండ్ వినిపించారు. గాజాలో శాంతికి అమెరికా ప్రతిపాదించిన 20 సూత్రాల ప్రణాళికను ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయని, కాల్పుల విరమణకు సంతకాలు చేసిన తర్వాత నోబెల్ శాంతి బహుమతికి తన పేరు ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. పాక్, ఇజ్రాయెల్ వంటి దేశాలు ట్రంప్‌ను శాంతి బహుమతికి నామినేట్ కూడా చేశాయి. అయితే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ బహుమతికి ట్రంప్ అసలు అర్హుడేనా అన్న చర్చ సర్వత్రా జరుగుతు న్నది. ఎందుకంటే పాలస్తీనా దురాక్రమణకు ఇజ్రాయెల్‌ను ఎగదోస్తు న్నదే అమెరికా కాబట్టి ప్రపంచ ప్రజలకు అనుమానాలు ఉన్నాయి.. ఇక రష్యాపై పోరుకు ఉక్రెయిన్‌కు పెద్ద ఎత్తున ఆయుధాలు సరఫరా చేస్తున్నది కూడా అగ్రరాజ్యమే కావడం గమనార్హం. అదేవిధంగా అఫ్ఘానిస్థాన్‌లో తాము నిర్మించిన ఎయిర్ బేస్‌ను బలవంతంగానైనా ఆక్రమిస్తామని, కెనడా కూడా అమెరికా భూభాగమేనని, దానిని తమ దేశంలో మరో రాష్ట్రంగా గుర్తిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటన లు చేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే వాణిజ్య సుంకాలతో ప్రపంచానికి కంటిమీద కునుకు లేకుండా చేశారు. అలాగే వీసాల విషయంలో నూ, గ్రీన్ కార్డుల విషయంలోనూ నానా గడ్డీ కరుస్తున్నారు. అలాంట ప్పుడు ట్రంప్ శాంతిదూత ఎప్పటికీ కాలేడు. అయితే హమాస్, ఇజ్రాయిల్ ఒప్పందం వల్ల శాంతి నెలకొంటే ప్రపంచానికి అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు. వేలాదిగా ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందుకే శాంతి ప్రణాళిక అమలుకు హమాస్, ఇజ్రాయిల్ చేసుకున్న ఒప్పందాన్ని భారత్‌సహా పలు ప్రపంచ దేశాలు స్వాగతించాయి. ఇయు, బ్రిటన్, కెనడా, బ్రిటన్, న్యూజిలాండ్, ఇరాన్, ఇటలీ, లెబనాన్, రష్యా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్ సహా పలు దేశాలు ఈ ఒప్పందాన్ని స్వాగతిం చిన వాటిలో ఉన్నాయి. మారణకాండకు స్వస్తి చెప్పే చొరవను, కార్యాచరణను ఎల్లప్పుడూ స్వాగతిస్తామని ఇరాన్ పేర్కొంది. గాజాలో శాంతి స్థాపనకు ఇదొక విశిష్ట అవకాశమని ఇటలీ ప్రధాని మెలొని వ్యాఖ్యానిం చారు. శాశ్వత కాల్పుల విరమణ దిశగా ఈ తొలి ఒప్పందం ముందడుగు అని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ వ్యాఖ్యానించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ స్పందిస్తూ రాజకీయ పరిష్కారానికి ఈ శాంతి ప్రణాళిక మార్గం వేస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఒప్పందం కుదరడం ఆనందించదగ్గ విషయమే కానీ, ఈ ఒప్పందం అమలు ఎలా వుంటుందో చూడడమే చాలా కీలకమని రష్యా పేర్కొంది. ఈ ప్రయత్నాలకు కచ్చితంగా మద్దతిస్తామని క్రెమ్లిన్ తెలిపింది. తాజా పరిణామాలను సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ స్వాగతిస్తూ న్యాయమైన, సమగ్రమైన శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నాయి. ఈ మేరకు సౌదీ, యుఎఇ విదేశాంగ శాఖలు ప్రకటనలు జారీ చేశాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతిస్తూ ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ, గాజా ప్రజానీకా నికి మూడు మాసాలకు సరిపడా ఆహార నిల్వలు తమ వద్ద వున్నాయని తెలిపింది. బందీల విడుదల, గాజా ప్రజలకు మానవతా సాయం పెంపు వంటి చర్యలు ఊరట కలిగిస్తాయని, దీర్ఘకాలిక శాంతికి దోహదపడ తాయని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం నెతన్యాహూ బలమైన నాయకత్వానికి అద్దం పట్టిందని కొనియాడారు. తన రాజకీయ అవసరాల కోసం, పదవిని కాపాడుకోవడం కోసం చిన్నారులు,మహిళలుసహా 70వేల మందికిపైగా పాలస్తీనియన్లను బలిగొన్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహును ప్రధాని మోడీ ప్రశంసించడం గమనార్హం.ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. గాజాలో కాల్పుల విరమణ జరపాలని, తన వద్ద బందీలుగా ఉన్న వారిని హమాస్ తక్షణమే విడుదల చేయాలని, నిరాటంకంగా మానవతా సాయాన్ని అందిం చాలని కోరుతూ ఈ ఏడాది ప్రారంభంలో ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితిలో మూడో వంతు సభ్యులు సమర్థించగా, భారత్ గైర్హాజరైంది. ప్రత్యక్ష చర్చల ద్వారానే శాంతి నెలకొంటుందని అభిప్రాయపడింది.

# ప్రైవేట్ మిల్లర్ల దోపిడీ

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** వడ్లను ఆరబెట్టే స్థలాలు లేక రైతులు ప్రైవేటు మిల్లర్లను ఆశ్రయిస్తూ పచ్చి వడ్లను అమ్ముతున్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వడ్లను నిల్వ చేయలేక, తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించి మిల్లర్లు క్వింటాల్‌కి రూ.1,950 మాత్రమే ఇస్తున్నారు. దీనికితోడు నాలుగున్నర కిలోల తరుగు తీస్తున్నారు. లోకల్ ఏజెంట్లకు రూ.100 కమిషన్ చెల్లించి, పేమెంట్ కోసం నెల రోజుల గడువు విధిస్తున్నారు. వెంటనే డబ్బులు కావాలంటే రూ.1,000కి రూ.200 కటింగ్ చేస్తూ దోచేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో కమిషన్ ఏజెంట్లను నియమించి సుమారు లక్ష క్వింటాళ్ల వడ్లు సేకరించారుఈసారి అధిక వర్షాలు రైతులను ముంచాయి. జిల్లాలో 5.60 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, అధికంగా 4.42 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడంతో 4 లక్షల ఎకరాల్లో సన్న వడ్లు సాగు చేశారు. సాగునీరు, బోర్లకు కరెంట్ సరఫరా మెరుగుపడటంతో వ్యవసాయ భూములన్నీ సాగులోకి వచ్చాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలతో 28,131 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. మిగతా చోట్ల వర్షాల కారణంగా దిగుబడి తగ్గింది. ఎకరానికి 40 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా, 35 బస్తాలకు మించలేదు. బోధన్ డివిజన్‌లోని 10 మండలాల్లో 20 రోజుల కిందే కోతలు ప్రారంభమయ్యాయి. వరుస వర్షాలు, తుఫాన్ హెచ్చరికలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. ప్రభుత్వ ధాన్యం సేకరణపై ప్రైవేట్ మిల్లర్ల ప్రభావం పడుతోంది. జిల్లా సివిల్ సప్లయ్స్ శాఖ అధికారులు 12.5 లక్షల మెట్రిక్ టన్నుల వడ్ల దిగుబడి అంచనా వేయగా, అందులో 9 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో మొత్తం 661 సెంటర్లు తెరవనున్నారు. ఇప్పటికే బోధన్ డివిజన్‌లోని 108 సెంటర్లు ప్రారంభమయ్యాయి. రైతులకు 17 శాతం తేమతో 'ఏ' గ్రేడ్ వడ్లు క్వింటాల్?కు ధర రూ.2,389, కామన్ రకం క్వింటాల్?కు రూ.2,369 రేటు నిర్ణయించగా, సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తోంది. వర్షాల భయం, కల్లాల కొరతతో రైతులు ప్రైవేట్ మిల్లర్ల వైపు మొగ్గు చూపుతున్నారు.

# తప్పొప్పుకుంటే కేసు మూసివేత

**-జరిమానా చెల్లించాలి ఫెమా ఉల్లంఘనపై ఫ్లిప్‌కార్ట్‌కు ఇడి బంఫర్ ఆఫర్**




న్యూఢిల్లీ : విదేశీ మారక నిర్వహణ చట్టం (ఫెమా) ఉల్లంఘలను ఒప్పుకొని, జరిమానా చెల్లిస్తే కేసును మూసివేస్తామని ఫ్లిప్‌కార్ట్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) బంఫర్ ఆఫర్ ఇచ్చింది. బహుళజాతి కంపెనీ వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్‌పై ఫెమా ఉల్లంఘనల కేసు దాదాపు నాలుగేళ్ల నుంచి కొనసాగుతోంది. ఈ కేసును పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పిస్తోన్నట్లు ఇడి పేర్కొంది. ఫ్లిప్‌కార్ట్ తన తప్పును అంగీకరించి జరిమానా చెల్లించడం ద్వారా సుదీర్ఘ న్యాయపరమైన చిక్కులు లేకుండా కేసును మూసివేయడానికి ఇడి హామీ ఇచ్చింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఇండియా రెండింటి పెట్టుబడులు, ఫెమా ఉల్లంఘనలపై ఇడి చాలా కాలంగా దర్యాప్తు చేస్తోంది. రెండు కంపెనీలు ఫెమా నిబంధనలను ఉల్లంఘించాయని, వారి ప్లాట్‌ఫామ్‌లపై డిస్కౌంట్లను అందించడం ద్వారా అమ్మకాలను పెంచడానికి ప్రయత్నించాయని ప్రధాన ఆరోపణ. విదేశీ పెట్టుబడి నిబంధనల ఉల్లంఘనలపై తొలిసారి 2021లో ఫ్లిప్‌కార్ట్, దాని అనుబంధ సంస్థలు, కొంతమంది వ్యక్తులకు ఇడి షో-కాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులు 2009 నుంచి 2015 మధ్య కార్యకలాపాలకు సంబంధించినవి. కాగా.. ఆ సమయంలో అమెరికన్ దిగ్గజం వాల్‌మార్ట్ ఫ్లిప్‌కార్ట్‌లో పెట్టుబడి పెట్టలేదు.

2018లో వాల్‌మార్ట్ ఫ్లిప్‌కార్ట్‌లో మెజారిటీ వాటాను సొంతం చేసుకుంది. అయితే 2016 నుంచి ఫ్లిప్‌కార్ట్‌పై దర్యాప్తు కొనసాగుతోంది. ఏప్రిల్ 2025లో కంపెనీకి కొత్త నోటీసు పంపింది. కాంపౌండింగ్ అనేది ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద ఒక నిబంధన. ఇది ఉల్లంఘనలకు పాల్పడిన సంస్థలు వాటి తప్పును స్వచ్ఛందంగా అంగీకరించడానికి,నిర్ణీత జరిమానా చెల్లించడానికి, తద్వారా క్రిమినల్ ప్రాసిక్యూషన్ లేదా సుదీర్ఘ న్యాయపరమైన అడ్డంకులను నివారించడానికి వీలు కల్పిస్తుంది. రెగ్యులేటరీ సంస్థలు కేసులను సమర్థవంతంగా, వేగంగా పరిష్కరించడానికి ఇది ఒక మార్గం. ఇడి ఇచ్చిన ఈ ఆఫర్‌ను ఫ్లిప్‌కార్ట్ అంగీకరిస్తుందా..? లేదా..? వేచి చూడాలి.

# గొట్టిపాటికి కలిసి రాని కాలం

**విజయవాడ,తెలంగాణ దిశ :** కొందరు మంత్రుల తీరుతో సీఎం చంద్రబాబు అసంతృ ప్తితో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. నిన్న జరిగిన క్యాబినెట్ సమావే శంలో సీఎంఫైర్ అయినట్లు సమాచారం. ముఖ్యంగా విద్యుత్ శాఖపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల చార్జీలు తగ్గించిన సంగతి తెలిసిందే. ట్రూ డౌన్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం చార్జీలను తగ్గించింది.చార్జీలు తగ్గించడం ఉమ్మడి ఏపీలో ఇదే తొలిసారి. కానీ దీనిపై విద్యుత్ శాఖ ప్రజల్లోకి బలంగా వెళ్లకపోవడంపై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున చార్జీలు తగ్గిస్తే ప్రచారం చేసుకోకపోతే ఎలా అంటూ క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుంటే ఏం చేస్తున్నారు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను చంద్రబాబు మందలించినట్లు తెలుస్తోంది.వాస్తవానికి క్యాబినెట్ సమా వేశం జరిగిన ప్రతిసారి మంత్రుల వ్యవహార శైలి చర్చకు వస్తోంది. కొంతమంది మంత్రులకు ఉద్వాసన తప్పదని ప్రచారం జరుగుతోంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు మాత్రమే అవుతోంది. సాధారణంగా మంత్రివర్గ విస్తరణ అనేది రెండేళ్లకు ఒకసారి జరుపుతారు. గత వైసిపి ప్రభుత్వం అయితే అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత విస్తరణ చేపట్టింది. కానీ చంద్రబాబు సర్కార్లో అధికారంలోకి వచ్చిన మూడు నెలల తరువాత నుంచి వింత ప్రచారం జరిగింది. మంత్రుల మార్పు ఉంటుందన్నది దాని సారాంశం. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది.అయితే తాజాగా విద్యుత్ చార్జీలకు సంబంధించి ప్రజలకు చెప్పుకోవడంలో విఫలమయ్యా మన అసంతృప్తి చంద్రబాబులో కనిపిస్తోంది.


దీనిపై సంబంధిత మంత్రి గొట్టిపాటి రవికుమార్ పై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే క్యాబినెట్ సమా వేశం జరిగిన ప్రతిసారి ఇటువంటి ప్రచారం జరగడం సర్వసాధా రణంగా మారింది. ఇందులో ఎంత మాత్రం నిజం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవాని కి ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కోస్తా, రాయలసీమ జిల్లాల నుంచి నలుగురు మంత్రులపై వేటు అని ఎప్పటినుంచో ప్రచారం సాగిస్తున్నా రు. కానీ ప్రభుత్వం మాత్రం అటువంటి చర్యలకు దిగలేదు. ఇప్పుడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పై వేటు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే రాజకీయంగా ఆయన బలమైన నేత. ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకునే అవకాశమే లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# బనకచర్ల డీపీఆర్ కోసం టెండర్లు

**మహబూబ్ నగర,తెలంగాణ దిశ :** పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో ఏపీ, కేంద్రం ఒక్కటయ్యాయి. ప్రాజెక్టుపై తెలంగాణతో పాటు కర్నాటక, తాజాగా మహారాష్ట్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోని ఏపీ సీఎం చంద్రబాబు.. తన మిత్ర పక్షమైన బీజేపీ అండతో బనకచర్లపై వేగం పెంచారు. ఈ క్రమంలో డిటెయిల్డ్ ప్రాజెక్ట్? రిపోర్టు (డీపీఆర్) తయారీ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్లను పిలిచింది. అదే రోజు నుంచి సంస్థలకు టెండర్ డాక్యుమెంట్ అందుబాటులో ఉంచింది. ఈ నెల 22న ఉదయం 11 గంటల వరకు టెండర్ డాక్యుమెంట్లను సమర్పించేలా గడువు విధించింది. టెండర్ డిపాజిట్ రూ.7.75 లక్షలుగా పేర్కొన్న ఏపీ.. పని విలువను రూ.9.2 కోట్లుగా వెల్లడించింది. ఈ విషయమై 20 రోజుల క్రితమే తెలంగాణ సర్కార్‌కు కేంద్ర జలశక్తి శాఖ లేఖ రాసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రాజెక్టుకు టెక్నో ఎకనామికల్ అప్రైజల్స్ ఇవ్వబోతున్నామని ఆ లేఖలో పేర్కొన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)ను కొద్ది నెలల క్రితం కేంద్రానికి ఏపీ సమర్పించింది. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వవద్దంటూ కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయగా, ఈ మేరకు కేంద్రం రిప్లై ఇచ్చినట్టు తెలిసింది. ఏపీ చేపట్టిన పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై మహారాష్ట్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రాజెక్టును వరద జలాల ఆధారంగా కడుతున్నట్టు ఏపీ చెబుతున్నదని.. అయితే, ఆ వరద జలాలు ఎగువ రాష్ట్రాలు వాడుకోగా మిగిలిన జలాలనే మళ్లిస్తారా లేదా అన్నది క్లారిటీ లేదని పేర్కొంది. ఎగువ రాష్ట్రాలు ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులకు దీని వల్ల నష్టం జరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్ మీదుగా పెన్నా బేసిన్‌కు తరలిస్తున్నారు కాబట్టి.. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఆ తరలించే జలాల్లో తమకూ వాటా ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ పీఎఫ్ఆర్‌పై తాజాగా సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ)కు మహారాష్ట్ర తన అభ్యంతరాలను తెలియజేసింది. పీఎఫ్ఆర్‌లో పేర్కొన్న అంశాలపై ఎగువ రాష్ట్రాలు క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం ఇవ్వాలని కోరింది. 1978 బచావత్ ట్రిబ్యునల్ అవార్డు కూడా పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లిస్తున్న 80 టీఎంసీల జలాల్లో కృష్ణా బేసిన్‌లోని రాష్ట్రాలైన నాటి ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలు, కర్నాటకకు 21, మహారాష్ట్రకు 14 టీంఎంసీల చొప్పున వాటాను కేటాయించిందని గుర్తు చేసింది.ప్రస్తుతం ఏపీ పోలవరం ద్వారా ఇప్పటికే 80 టీఎంసీలను మళ్లిస్తున్నదని, పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు ద్వారా ఇప్పుడు మరో 243 టీఎంసీలను మొత్తంగా 323 టీఎంసీలను కృష్ణాకు మళ్లించనుందని పేర్కొంది. కాబట్టి బచావత్ ట్రిబ్యునల్ అవార్డు గతంలో నిర్దేశించిన నిష్పత్తి ప్రకారం ఆ మళ్లించే జలాల్లోనూ తమకు వాటా ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పింది. కేంద్రం పీబీ లింక్ ప్రాజెక్టుకు అనుమతిస్తే అవార్డు ప్రకారం తమ వాటా వినియోగించుకుంటామని ఆ లేఖలో స్పష్టం చేసింది. ఇందులో పొరుగు రాష్ట్రాలతో సంప్రదించాల్సిన పనికూడా లేదని స్పష్టం చేసింది. వరద జలాల ఆధారంగా ప్రాజెక్టులను నిర్మించినట్టయితే.. వాటి డీపీఆర్‌ల తయారీకి మార్గదర్శకాలు ఉంటే పంపించాలని, తాము కూడా వరద ఆధారిత ప్రాజెక్టుల డీపీఆర్‌లను పంపుతామని మహారాష్ట్ర తెలిపింది. తమ రాష్ట్రంలోనూ విదర్భ తదితర కరువు పీడిత ప్రాంతాలున్నాయని ఆ లేఖలో గుర్తుచేసింది.బనకచర్ల విషయంలో ఏపీ దూకుడుపై తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచీ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. బనకచర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వవద్దని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖలు రాయడంతో పాటు.. రెండు రాష్ట్రాల సీఎంలతో కేంద్రం ఏర్పాటు చేసిన మీటింగులోనూ పాల్గొన్నారు. ఆనాడు లోపల బనకచర్ల గురించి చర్చ జరగలేదని చెప్పినా.. ఏపీ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు బయట మీడియాతో బనకచర్లను కట్టితీరుతామని చెప్పారు. ఇప్పుడు ఆ వ్యవహారం డీపీఆర్ తయారీకి టెండర్ల వరకు వచ్చింది.

సైబర్ నేరగాళ్లే కాదు..

# దోస్తులతోను జాగ్రత్త




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** సైబర్ నేరగాళ్లే కాదు.. తనతో స్నేహం చేస్తున్న దోస్తులతోను అమ్మాయిలు ఇకపై జాగ్రత్తగా ఉండాల్సిందే. ఎందుకంటే ఢిల్లీలో జరిగిన ఓ సంఘటన అందరిని షాక్‌కు గురి చేసింది. వివరాల్లోకి వెళితే.. సోషల్ మీడియాలో పరిచయం అయిన ఓ యువతి, మరో యువతితో స్నేహం చేసింది. తన పర్సనల్ విషయాలను బాధిత యువతితో పంచుకుంది. అనంతరం కొద్ది రోజులకు వారి మధ్య స్నేహం పెరిగిపోయింది. దీంతో సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన యువతి.. మరో యువతి ప్రైవేట్ వీడియోలు, ఫోటోలను పంచుకోవడానికి ఒప్పించింది. అనంతరం ఇరువురు వారి వారి ప్రైవేట్ కంటెంట్‌ను పంచుకున్నారు. దీంతో ఆన్ లైన్ లో పరిచయం అయిన యువతి అసలు రంగు బయటపడింది. తాను అడిగినంత డబ్బులు ఇవ్వక పోతే.. తనతో పంచుకున్న ప్రైవేట్ కంటెంట్‌ను యువతి బంధువులకు షేర్ చేస్తానని బెదిరించింది. దీంతో ఆ యువతి వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో.. అసలు విషయం బయట పడింది. మనోజ్ వర్మ అనే యువకుడు సోషల్ మీడియాలో ఫేక్ మహిళా ప్రొఫైల్‌ను క్రియేట్ చేసుకొని ఇదంతా చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు నేరంలో ఉపయోగిం చిన వాట్సాప్ చాట్‌లు, అశ్లీల వీడియోలు, నకిలీ ఫేస్‌బుక్ ఖాతాలను కలిగి ఉన్న ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన యువతులకు స్పష్టమైన హెచ్చరికగా నిలిచింది. ఆన్‌లైన్‌లో ఎవరి పట్లనైనా పూర్తి నమ్మకం ఉంచకూడదు, ప్రత్యేకంగా వ్యక్తిగత సమాచా రం, ప్రైవేట్ కంటెంట్ పంచుకునే ముందు అనేక సార్లు ఆలోచించాలి. స్నేహం పేరుతో మోసగాళ్లు దగ్గరయ్యే అవకాశాన్ని గుర్తించి జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి అని ఢిల్లీలో జరిగిన ఈ మోసం దేశవ్యాప్తంగా ఉన్న యువతి యువకులకు హెచ్చరికలు జారీ చేస్తుంది.

రంగంపేటలో కోతుల బెడద..

# వీధుల్లో తిరగలేకపోతున్న ప్రజలు..

**పట్టించుకోని అధికారులు**



కొల్చారం,తెలంగాణ దిశ : కొల్చారం మండలంలోని ప్రముఖ వ్యాపార వాణిజ్య కేంద్రమైన రంగంపేటలో కోతుల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం లేవగానే వందల సంఖ్యలో కోతులు గ్రామంలోని వీధులలో తిరుగుతున్నాయి. తరచూ రోడ్డు మార్గంలో వెళుతున్న చిన్నపిల్లలు మహిళలు పై కోతులు దాడులు చేస్తున్నాయి. దీంతో గత కొన్ని రోజులుగా చాలామంది గ్రామస్తులు ఆస్పత్రుల పాలయ్యారు. కోతుల సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పంచాయతీ అధికారులు కానీ అటవీశాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. గ్రామంలో కోతులు ఇండ్లలోకి జొరబడి ఆహార పదార్థాలను తీసుకెళ్తుండడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా గ్రామంలోని కోతుల సమస్యను పరిష్కరించేలా గ్రామ పంచాయతీ, అటవీ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ఈ ఏడాది 1040 మంది మావోయిస్టుల లొంగుబాటు



**- 2025లో ఇదే అత్యధికం**
**- ఛత్తీస్‌గఢ్ పోలీస్ డేటా**

రాయ్ పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులు పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. అదేస్థాయిలో లొంగిపోతున్నారు. ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో వెయ్యి మందికి పైగా మావోయిస్టులు సరెండరయ్యారు. ఆ రాష్ట్ర పోలీసు సమాచారాం ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నది.

ఈ డేటా ప్రకారం.. 2025లో ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్‌లో 1040 మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోయారు. ఒక్క ఏడాదిలో లొంగిపోయిన మావోయిస్టుల సంఖ్య ఇదే అత్యధికం కావటం గమనార్హం. గతేడాది ఈ సంఖ్య 881గా ఉన్నది. గత రెండేండ్లలో లొంగిపోయిన మావోయిస్టుల సంఖ్య అనూహ్య పెరుగుదలను చూసింది. 2020లో 344 మంది మావోయిస్టులు లొంగిపోయారు. 2021లో ఈ సంఖ్య 544గా, 2022లో 417గా, 2023లో 414గా ఉన్నది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికే దేశంలో మావోయిస్టులను సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఉన్నది. వచ్చే ఏడాది మార్చి 31ని ఇందుకు డెడ్‌లైన్‌గా విధించుకున్నది. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా కూడా పదేపదే ఇదే విషయాన్ని చెప్తున్నారు. ఈ గడువు దగ్గర పడటానికి దాదాపు ఆరు నెలల సమయం మాత్రమే మిగిలి ఉన్నది. కాబట్టి 2025 ముగింపు నాటికి మావోయిస్టుల లొంగుబాటు రికార్డు స్థాయిలో ఉండొచ్చని పోలీసు వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ వారంలో మధ్యస్థ స్థాయి నుంచి సీనియర్ స్థాయి క్యాడర్ వరకు మరరో రౌండ్ లొంగుబాటు జరుగుతుందని తాము ఆశిస్తున్నట్టు కేంద్ర సాయుధ పోలీసు దళాల అధికారులు చెప్తున్నారు. నవంబర్ 1న జరిగే రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు హాజరు కావడానికి ప్రధాని మోడీ ఛత్తీస్‌గఢ్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ లొంగుబాటు జరగనున్నదని తెలుస్తున్నది. ఈనెల 8న తమపై మొత్తం రూ.48 లక్షల రివార్డును కలిగి ఉన్న 16 మంది మావోయిస్టులు నారాయణ్‌పూర్ జిల్లా పోలీసుల ముందు లొంగిపోయారు. ఇక కేంద్ర గడువుకు ముందే ఛత్తీస్‌గఢ్.. వార్షిక డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్(డీజీపీ), ఇన్‌స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ)ల సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనున్నది. గతేడాది ఈ సమావేశం ఒడిశాలో జరిగింది. ఈ ఏడాది వార్షిక సమావేశం నవంబర్ 28-30 మధ్య నయా రాయ్ పూర్‌లో జరిగే అవకాశం ఉన్నది. కేంద్ర హెూం మంత్రి ఈ 60వ సదస్సునను ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ.. రెండో రోజు కార్యక్రమంలో ప్రధాని మోడీ కూడా పాల్గొని పోలీసు ఉన్నతాధికారులను ఉద్దేశించి ప్రసంగిస్తారని ఛత్తీస్‌గఢ్‌లోని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు.

# గేమ్ ఛేంజర్ గా విజయవాడ రహదారి



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజధాని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ వాణిజ్య కేంద్రం విజయవాడ మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గబోతోంది. 6-7 గంటల సమయాన్ని కేవలం 2 గంటల్లోనే చేరుకునేలా ఒక బృహత్తర ప్రాజెక్టు శరవేగంగా ముందుకు కదులుతోంది. రెండు నగరాల మధ్య కొత్త 6-లేన్ల హైవే నిర్మించడం ద్వారా రెండు నగరాల మధ్య దూరం కేవలం 2 రెండు గంటలకు తగ్గుతుందని భావిస్తున్నారు. సాధారణంగా ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి దాదాపు 5 నుండి 6 గంటల సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో 235 కిలోమీటర్ల పొడవైన ఈ కొత్త మార్గం అందుబాటులోకి వస్తే, ఇది ఈ ప్రాంత కనెక్టివిటీకి ఒక గేమ్ ఛేంజర్ గా మారనుంది.ప్రస్తుతం విజయవాడ ? హైదరాబాద్ మధ్య ఔఊ 65 ఉంది. ఇది నాలుగు లేన్ల రహదారి. దీన్ని 6 లేన్లకు విస్తరించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు దీనికి మోక్షం కలుగుతోంది. ఈ జాతీయ రహదారిని 6 లేన్లకు విస్తరించడంతో పాటు అత్యాధునిక సౌకర్యాలతో దీన్ని ప్రమాదరహితంగా తీర్చిదిద్దనున్నారు. 2 గంటల్లో ప్రయాణం సాధ్యమయ్యేలా యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్ హైవేని నిర్మిస్తారు. అంటే ఇరువైపులా కంచె వేసి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తారు. తద్వారా గరిష్ట వేగం సాధ్యమవుతుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ నుంచి చౌటుప్పల్, నార్కట్ పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, మునగాల, చిల్లకల్లు, నందిగామ, కంచికచర్ల, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, విజయవాడ వరకూ ఈ రహదారి ఉంటుంది.సాధారణంగా రోడ్డు ప్రాజెక్టుల్లో ఎదురయ్యే జాప్యాలకు భిన్నంగా, ఈ మెగా ప్రాజెక్టు పనులు శరవేగంగా కదులుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన టెండర్లను వచ్చే ఏడాది మార్చి నాటికి ఖరారు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పనులు వేగంగా పూర్తి చేసి, రోడ్డును త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ 6-లేన్ల హైవేను అత్యాధునిక ప్రమాణాలతో డిజైన్ చేస్తున్నారు. వాహనాలు సురక్షితంగా, సమర్థవంతంగా, గరిష్ట వేగంతో ప్రయాణిం చడానికి వీలుగా రోడ్డు నిర్మాణం జరగనుంది. తద్వారా వేగాన్ని పెంచినా, భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చూసుకోవడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశాలలో ఒకటి.ఈ ప్రాజెక్టు పూర్తయితే, కేవలం ప్రయాణ సౌలభ్యాన్ని మాత్రమే కాక, ఈ రెండు ప్రాంతాలు కూడా అభివృద్ధిలో గణనీయంగా మెరుగుపడతాయని అంచనా వేస్తున్నారు. దూరం, సమయం తగ్గడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం బాగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. అంతేకాక ఈ రెండు నగరాలతో పాటు మార్గం వెంబడి పెట్టుబడులు కూడా పెద్దఎత్తున తరలి వస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద, ఈ కొత్త 6-లేన్ల రహదారి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వాణిజ్యం, ఆర్థిక వృద్ధి, ప్రజల ప్రయాణానికి మరింత సౌలభ్యం చేకూర్చనుంది

# నారీ రక్ష



రాత్రికి దానికంటూ ఒక అందం వుంది. ఒక ప్రత్యేకమైన గుర్తింపు వుంది. రాత్రిపూట కవిత్వం కురుస్తుంది. 'రాత్రి అందాలను ఎప్పుడూ అనుభవించనివాడు నిజమైన కవి/ కళాకారుడు కాలేడు' అంటారో రచయిత. రాత్రిపూట ప్రపంచం ఒక కలలా అనిపిస్తుంది. 'స్నానం చేసి తలారబోసినట్లు ఆకాశంలో నల్లటి చీకటి' అంటూ రాత్రి సౌంద ర్యాన్ని వర్ణిస్తాడు శీలా వీర్రాజు ఓ కథలో. లెక్కలేనన్ని ఆలోచనలు, చిత్రాలు, రూపకాలు, దుఃఖాలు, భయాలు రూపుదిద్దుకుంటాయి చీకటిలో. అర్ధరాత్రి ఆకాశం కింద ఫుట్‌పాత్‌లు రూపాంతరం చెందు తాయి. వెన్నెల వికసిస్తుంది. నల్లని తారు రోడ్లపై మృదువైన కిరణాలు నృత్యం చేస్తుంటాయి. అలసిన శరీరానికి, మనసుకు చంద్రుని వెలుగులో ఓదార్పు లభిస్తుంది. ఇంత అందమైన రాత్రి, స్త్రీలకు ఎందుకు చెడ్డదిగా, ప్రమాదకరమైనదిగా పరిగణించబడుతుంది? అమ్మాయిలు పురుషులతో సమానంగా ఎక్కడైనా స్వేచ్ఛగా జీవించగల ఈ సమాజంలో తమ కలలను సాకారం చేసుకోడానికి నిజంగా స్థలం లేదా? 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః' అంటూ మహిళలను దేవతలుగా పూజిస్తారు. అదే సమాజం.. నిజ జీవితంలో వారికి స్వేచ్ఛ, భద్రత, గౌరవం లేకుండా చేస్తున్నది. స్త్రీల పట్ల ఈ కపటత్వం ఎందుకు? పండు వెన్నెలయినా, వీధి దీపాలైనా రోడ్లను ప్రకాశవంతం చేస్తాయి. కానీ చాలామంది మహిళలకు ఈ చీకటి రాత్రులు కాళరాత్రిని తలపిస్తాయి. ఇంటికి వెళ్లే మార్గాన్ని భయం కబళించివేస్తుంది. జాతీయ వార్షిక నివేదిక మహిళల భద్రత సూచీ (ఎన్.ఎ.ఆర్.ఐ)-2025 ఈ విషయాన్ని ధృవీకరించింది. దేశంలోని 31 నగరాల్లో సర్వే చేసిన జాతీయ మహిళా కమిషన్ 'నారీ సూచీ-2025' నివేదికను విడుదల చేసింది. ప్రతి ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురవుతుండగా, 40 శాతం మంది మహిళలు సురక్షితంగా లేమని ఫీలవుతున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. రాత్రి వేళల్లో ముఖ్యంగా ప్రభుత్వ రవాణా మార్గాల్లో, వినోద ప్రదేశాల వద్ద భద్రతకు సంబంధించిన అవగాహనలో తీవ్రమైన తగ్గుదల వుందని ఈ అధ్యయనం తెలిపింది. మహిళలకు రక్షణ లోపించిన నగరాల జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ వుండటం గమనార్హం. నాణేనికి రెండోవైపు అన్నట్లు.. ఇంటి బయటే కాదు, ఇంట్లోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే వుంది. అదనపు కట్నం కోసమో, అనుమానంతోనో, తనకన్నా ఎక్కువ సంపాదిస్తున్నదనో భార్యను హింసించడం, హతమార్చడం సర్వసాధారణంగా మారింది. 'భార్యాభర్తలన్నాక ఇదంతా మామూలే కదా%ా%' అన్నాడు గ్రేటర్ నోయిడాలో భార్యను హత్యచేసిన తర్వాత.. విపిన్ భాటీ అనే ఓ ఘనాపాటి. దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మహిళ హింసకు గురౌతోంది. దేశాభివృద్ధి కేవలం జీడిపి గణాంకాల్లో వస్తే చాలదు.. మన ఆలోచనా విధానంలో రావాలి. ఈ వికృత ధోరణులను పెంచి పోషిస్తోన్న వినిమయదారీ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలి. 'మహిళ స్వేచ్ఛ.. హక్కు మాత్రమే కాదు, అది సమాజ ఆత్మకు శ్వాస' అంటారు సరోజిని నాయుడు. దేశంలో సామాజిక కట్టుబాట్లు, సంప్రదాయాలు మహిళల్ని కట్టిపడేసినంతగా.. మగవాళ్లను పట్టించుకోవడం లేదు. 'విపిన్ భాటీ లాంటి వాళ్లుభార్యను హింసించడం మామూలే అన్న ధోరణిని చూసీ చూడనట్లుగా వుండటమో, చూసీ మౌనంగా వుండిపోవడమో అంటే, పరోక్షంగా మనమంతా ఈ నేరాలను సమర్థిస్తున్నట్లుగా, భాగస్వాములమైనట్లుగానో భావించాల్సిందే' అంటారో సామాజికవేత్త. ఐరాస చెప్పినట్లు.. మహిళలపై జరుగుతున్న హింసను మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలి. సమాజంలో మహిళలపై హింసను ప్రేరేపిస్తున్న విష సంస్కృతి పట్ల ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి. 'నేను ఆకాశాన్ని చేరుకున్నాను. కానీ, ప్రతి మహిళా భయంలేకుండా భూమిపైనడవగలగడం మరింత గొప్ప విజయమవుతుంది' అంటారు కల్పనాచావ్లా. మహిళ సురక్షితురాలు అయితేనేసమాజం సుసంపన్నం అవుతుంది. భవిత కాంతివంతమైతేనే, దేశ భవిష్యత్ ఉజ్వలమౌతుంది. తమ బిడ్డలకు రాత్రిపూట భయపడకుండా 'వెళ్లి చంద్రుడిని చూడండి, వెన్నెల్లో వీచే చల్లగాలిని ఆస్వాదించండి, స్వేచ్ఛగా జీవించండి' అని గర్వంగా చెప్పగలిగే పరిస్థితిని సృష్టిద్దాం.

## తాడిపత్రికి పెద్దిరెడ్డి



అనంతపురం,: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మరోసారి నియోజకవర్గంలోకి అడుగు పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తనను తాడిపత్రి నియోజకవర్గంలోకి అడుగు పెట్టేందుకు పోలీసులు అనుమతించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకూ తాను తాడిపత్రికి వెళ్లితీరతానని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి చెబుతున్నారు. ఆయన హైకోర్టుకు వెళ్లారు. అక్కడ సింగిల్ బెంచ్ తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతించినా తర్వాత డివిజన్ బెంచ్ కు పోలీసులు వెళ్లారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళితే శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశముందని చెప్పడంతో డివిజన్ బెంచ్ పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతిని నిరాకరించింది. గతంలో ఇచ్చిన సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై స్టే విధించింది. తాడిపత్రిలో టీడీపీ, వైసీపీ పార్టీల మధ్య ఒక విధంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. తాడిపత్రి నియోజకవర్గంలోకి వెళ్లేందుకు తనను అనుమతించకపోవడంపై పెద్దారెడ్డి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారంలో ఉండి పోలీసులను అడ్డం పెట్టుకుని తనకు అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల్ల తనకు కూడా తాడిపత్రి ప్రజలు ఓట్లు వేశారన్న విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు. తాను తన సొంత ఇంటికి వెళ్లేందుకు అనుమతిని కూడా ఇవ్వకుండా పోలీసులతో కుమ్మక్కై ఈ ప్రభుత్వం నియంతలా వ్యవహరిస్తుందన్న ఆరోపణలను ఆయన నేరుగా చేస్తున్నారు. ఈ సమయంలో పెద్దారెడ్డి సుప్రీంకోర్టు ఉత్తర్వులతో రెండు, మూడు రోజుల్లో తాడిపత్రికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు అయితే తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే ఆయన బాధితులే అడ్డుకుంటారని హాట్ కామెంట్స్ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి అనేక అరాచకాలు, అక్రమాలు చేశాడని, గత ప్రభుత్వంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి కోమటికుంట్లలో 180 ఎకరాలు ఆక్రమించుకున్నాడని, తాడిపత్రి అంటే తమకు ఒక దేవాలయం, తాడిపత్రి ప్రజలు తమకు దేవుళ్ళని అంటున్నారు. తాడిపత్రికి మంచి చేశాం కాబట్టే 40 ఏళ్లుగా ప్రజలు తమ కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్నారని, గత ప్రభుత్వంలో చేసిన అరాచకాలపై మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపిస్తున్నారు. మొత్తం మీద మరోసారి తాడిపత్రి టెన్షన్ పోలీసులకు ఇబ్బందికరంగా మారనుంది.

# తలసరి లెక్కలు 'డొల్లేనా'?



### చర్చనీయాంశమైన రిజర్వ్‌బ్యారకు తాజా నివేదిక

అమరావతి : రాష్ట్ర ప్రణాళిక శాఖ తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిరదని, రానున్న కాలంలో నంబర్ వన్ స్థానానికి చేరుకురటామని చెబుతురడగా, తాజాగా రిజర్వ్ బ్యారకు ప్రకటిరచిన ఒక నివేదికలో మాత్రం రాష్ట్ర పరిస్థితి మెరుగ్గా లేదని తేలిపోయిరది. ప్రస్తుత ధరలు, నిలకడ ధరల గణారకాల్లో అనేక చిన్న రాష్ట్రాల కన్నా కూడా ఆరధ్రప్రదేశ్ వెనుకబడి ఉన్నట్లు తేలడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత ధరలు, నిలకడ ధరల ఆధారంగా పలు రాష్ట్రాల్లో ఉన్న తలసరి ఆదాయ వివరాలను ఆర్‌బిఐ తన నివేదికలో వెల్లడిరచిరది. ఇరదులో ప్రస్తుత ధరల జాబితాలో ఎపి ఏడో స్థానంలో ఉరడగా, నిలకడ ధరల జాబితాలో ఏకంగా 13వ స్థానంలో కొనసాగుతురడడం ఆశ్చర్యం కలిగిస్తోరది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ తలసరిలో ఉత్తమ ర్యారకులు నమోదు చేస్తురడగా, ఉత్తరాఖరఢ్, సిక్కిం, పుదుచ్చేరి, మిజోరామ్, అరడమాన్ నికోబార్ వంటి చిన్న రాష్ట్రాలు కూడా మర రాష్ట్రం కన్నా మెరుగైన ర్యారకుల్లోనే కొనసాగుతున్నట్లు తేలిరది. ప్రస్తుత జాబితాలో ప్రస్తుత ధరలకు సంబంధిరచి ఆరధ్రప్రదేశ్ 2,65,240 రూపాయలతో ఏడో స్థానంలో ఉరడగా, నిలకడ ధరల జాబితాలో 1,41,609 రూపాయలతో 13వ స్థానంలో కొనసాగుతోరది. ఇతర రాష్ట్రాల పరిస్థితి గమనిస్తే కరంట్ ధరల జాబితాలో కర్నాటక 3,80,906 రూపాయలతో అగ్రస్థానంలో కొనసాగుతురడగా, పక్క రాష్ట్రమైన తెలంగాణ 3,79,751 రూపాయలతో రెరడో స్థానంలో కొనసాగుతురడడం విశేషర. తమిళనాడు, హర్యానా, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు వరుసగా మూడు నురచి ఆరో స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఇక కాన్‌స్టరట్ ధరల మేరకు సిక్కిర 2,92,339 రూపాయల తలసరితో అగ్రస్థానంలో ఉరడగా, ఢిల్లీ 2,71,490 రూపాయలతో రెరడో స్థానంలో ఉరడగా, తరువాత స్థానాల్లో ఛరడీఘర్, కర్నాటక, తమిళనాడు, హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయి.

## ముళ్లపోదలు తొలగించిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

గోదావరిఖని : జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం రెండవ రోజు కార్యక్రమాలలో భాగంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వాలంటీర్లు కార్యక్రమాధికారి డి శంకర్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పీజీ కళాశాల మైదానంలో పెరిగిన ముళ్ళపొదలు, కలుపు మొక్కలు తొలగించారు

అనంతరం బిజినెస్ కళాశాల ఆవరణలో సైబర్ నేరాలు, అప్రమత్తత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగినది ఈ కార్యక్రమానికి గోదావరిఖని సైబర్ పోలీస్ స్టేషన్ వలయాధికారి కృష్ణమూర్తి హాజరై వాలంటీర్లకు

సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. అనవసరంగా వచ్చే ఫోన్ కాల్స్ ని నమ్మవద్దని ప్రస్తుతం జరుగుతున్న కొన్ని సంఘటనలు గురించి వివరించారు. సైబర్ నేరగాల వలలో పడి మోసపోయి పోలీస్ స్టేషన్ కి వచ్చిన వ్యక్తులు వారి సంఘటనల గురించి అవగాహన కల్పించారు

# ఇక ఆరుకిలోల బియ్యం...



**నిజామాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం త్వరితగతిన కొత్త రేషన్ కార్డులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో రేషన్ పంపిణీ ప్రక్రియను సెప్టెంబర్ 1వ తేదీ నుంచి తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరికి నెలకు 6 కిలోల చొప్పున నిత్యావసర వస్తువులు అందించనున్నారు. ఇదివరకే జూన్ నెలలో మూడు నెలల రేషన్ పంపిణీ పూర్తయినందున.. మళ్లీ సెప్టెంబరు నుంచి సరఫరా షురూ అవుతోంది. అయితే.. ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయని లబ్ధిదారులకు రేషన్ సదుపాయం తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. మేడ్చల్?మల్కాజిగిరి జిల్లాలో ఈ అంశంపై జిల్లా పౌర సరఫరా అధికారి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటన రిలీజ్ చేశారు. అందులోని వివరాల ప్రకారం.. జిల్లాలో 5.37 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి అనుబంధంగా దాదాపు 18.65 లక్షల లబ్ధిదారులు ఉన్నారు. అయితే ఇప్పటి వరకు ఈ-కేవైసీ ప్రక్రియను 13.19 లక్షల మంది మాత్రమే పూర్తిచేశారు. మిగిలిన వారు సెప్టెంబర్ నెల లోపు తప్పనిసరిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. చిన్నపిల్లలను (ఐదు సంవత్సరాల లోపు) ఈ ప్రక్రియ నుండి మినహాయించినట్లు తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారులు ఎటువంటి ప్రయాణం అవసరం లేకుండా, తమ సమీప రేషన్ షాప్ నుండే బయోమెట్రిక్ ఆధారంగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకునే అవకాశం కల్పించినట్లు స్పష్టం చేశారు. కేవైసీ చేయడం ద్వారా నకిలీ లబ్ధిదారులని గుర్తించి తొలగించడం, నిజమైన అర్హులకు న్యాయం చేయగలమని అధికారులు చెబుతున్నారు. అలాగే రేషన్ పంపిణీలో పారదర్శకతను పెంపొందించవచ్చని చెప్పారు. డిజిటల్ ఫింగర్ ప్రింట్ ఆధారంగా స్టోర్ చేసే డేటా ద్వారా భవిష్యత్తులో రేషన్‌తో పాటు ఇతర పథకాల ప్రయోజనాలు సులభంగా అందించవచ్చని వివరించారు. ఈ-కేవైసీ పూర్తి చేయని కుటుంబాలకు రేషన్ సౌకర్యం నిలిపివేసే అవకాశం ఉందని హెచ్చరిస్తూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ త్వరలోనే నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# బుగులోని గుట్టలను టూరిజం హబ్ గా చేస్తాం

**-- రూ.160 లక్షలతో మెట్ల మార్గం, రెయిలింగ్, కోనేరు నుండి గుట్టపైకి మంచి నీటి సరఫరా పనులు**






జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ : నమ్మి కొలిస్తే కోరిన కోరికలు తీరుతా యని భక్తులు విశ్వసించే రెండో తిరుపతిగా పేరుగాంచిన బుగులో ని వెంకటేశ్వర స్వామి గుట్టలను టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. అటవీ శాఖ నిధులు రూ.160 లక్షలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బుగులోని వెంకటేశ్వర స్వామి గుట్టలను టూరిజం హబ్ గా అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇదివరకే జాతరకు వచ్చే అన్ని రోడ్లకు నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. అట్టి పనులు గుత్తేదారు నిర్లక్ష్యంతో ఆలస్యం జరుగు తున్న మాట వాస్తవమేనన్నారు. పనులు మొత్తం త్వరితగతిన పూర్తి అయ్యేలా చూస్తానన్నారు. రూ.160 లక్షలతో మెట్లను విస్తరించడం, రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు, భక్తులకు త్రాగునీటి కొరకు కోనేరు నుండి గుట్టపైకి మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మరిన్ని నిధుల కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆ నిధులు కూడా మంజూరు అయితే జాతర లో అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు.

# వాహనదారులకు ఆర్టీఏ మెసేజ్‌లు!

విజయవాడ,తెలంగాణ దిశ: ''ఏపీలోని వాహనదారులకు ముఖ్యమైన గమనిక.. మీకు డ్రైవింగ్ లైసెన్స్ , వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) ఉందా.. అయితే వెంటనే అందులోని మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోండి. ఆధార్ ధ్రువీకరణ ద్వారా సెల్ ఫోన్ నంబర్లను అప్‌డేట్ చేసుకోండి..'' అంటూ ఏపీ రవాణా శాఖ నుంచి వాహనదారులకు మెసేజులు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ఎవరికి వారే వ్యక్తిగతంగా ఈ పని చేసుకోవచ్చని.. ఇందుకోసం పోర్టల్‌ను సందర్శించాలని రవాణాశాఖ సంక్షిప్త సందేశాలు పంపిస్తోంది. ఆ పోర్టల్‌లో ఆర్‌సీ, లైసెన్సు వివరాలను మొబైల్ నంబరుతో అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తోంది. ఇదంతా ఎందుకం టే కేంద్ర ప్రభుత్వం పరివాహన్ సేవ అనే పోర్టల్ అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిం దే. అన్ని రాష్ట్రాల రవాణాశాఖ సేవలను ఇందులోకి మారుస్తున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి రవాణా శాఖ సేవలు ఈ ప్రగతి.ఓఆర్‌జీలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇందులోని వివరాలను కూడా పరివాహన్‌లోకి మార్చారు. అయితే కొన్ని డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ల వివరాలు అప్‌డేట్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇలాంటి వాటిని వాహనదారులు సొంతం గా ఆధార్ ధ్రువీకరణ ద్వారా అప్‌డేట్ చేసుకోవాలని రవాణా శాఖ సూచిస్తోంది. మొబైల్ నంబర్లను అప్‌డేట్ చేసుకోవాలనుకుంటే వాహనదారులు ముందు గా పరివాహనసేవాస్ అనే పోర్టల్‌లోకి వెళ్లాలి. ఆ తర్వాత పరివా హన్ పేజీలోకి వెళ్లాలి. ఆపేజీలో పలు రకాల సేవలు ఉంటాయి. అందులో ఏదో ఒక సేవ పైన క్లిక్ చేయగానే అప్‌డేట్ యువర్ మొబైల్ నంబర్ అంటూ స్క్రీన్ మీద వస్తుంది. ఇందులో వాహన్, సారథి అంటూ క్యూఆర్ కోడ్లు, వెబ్‌సైట్ లింకులు దర్శనమిస్తాయి. మొబైల్‌లో అప్‌డేట్ చేసుకునే వారు.. ఖీఖీ కోడ్ స్కాన్ చేసి అప్ డేట్ చేసుకోవచ్చు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ ద్వారా అయితే లింక్‌లను క్లిక్ చేసి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక వాహన్, సారథి రెండింటిలోనూ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. వాహన్‌లో అయితే.. వాహనాల ఆర్సీలను మొబైల్ నంబర్‌తో లింక్ చేసుకోవాల్సి ఉంటుంది.

రిజిస్ట్రేషన్, ఛాసిస్, ఇంజిన్ నంబర్ల వివరాలను నింపి.. ఆర్‌సీలోని వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత క్యాప్చా నమోదు చేసి..వ్యాలిడేట్ మీద క్లిక్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఆధార్ కార్డు నంబరు, ఆధార్ కార్డులో ఉన్నట్టుగానే పేరు నమోజు చేయాలి. మొబైల్ నంబరు నమోదు చేసి వెరిఫై మీద క్లిక్ చేయాలి. దీంతో మొబైల్ నంబరు.. ఆర్‌సీకి లింక్ అవుతుంది. అప్పటికే మొబైల్ నంబర్ లింక్ చేసినవారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదు. మరోవైపు సారథిలో అయితే డ్రైవింగ్ లైసెన్సులను మొబైల్ నంబర్‌తో అప్‌డేట్ చేసుకోవాలి. డ్రైవింగ్ లైసెన్సు నంబరు, పుట్టినరోజు, ఇతరత్రా వివరాలు నమోదు చేయాలి. నమోదుచేసి.. ఆధార్ కార్డు వివరాలు ఎంటర్ చేస్తే..ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని నమోదు చేసి సబ్మిట్ బటన్ నొక్కితే.. డ్రైవింగ్ లైసెన్సు వివరాలు మొబైల్ నంబర్‌తో లింక్ అవుతాయి. ఇలా చేస్తే భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ బదిలీ సులువుగా ఉంటుందని అధికారులు చెప్తున్నారు


## మళ్లీ వాయిదా పడ్డ ఎస్జిఎఫ్ మంథని జోనల్ స్థాయి క్రీడా పోటీలు

మంథని: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగాల్సిన మంథని జోనల్ స్థాయి క్రీడా పోటీలను వాయిదా వేశామని మంథని మండల విద్యాధికారి, ఎస్జిఎఫ్ జోన్ అధ్యక్షురాలు దాసరి లక్ష్మి, మంథని జోన్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ లు తెలిపారు.

పరిస్థితులు అనుకూలించక ఎస్జిఎఫ్ డివిజన్ స్థాయి కబడ్డీ, కోకో, వాలీబాల్ మరియు అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నాలుగు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులతో చర్చించి వాయిదా నిర్ణయం తీసుకున్నామని వారు తెలిపారు.

కబడ్డీ,ఖో-ఖో మరియు వాలీబాల్ మంథని జోనల్ స్థాయి ఆటలు మరియు అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తామని వారు తెలిపారు. మంథని జోనల్ స్థాయిలోని వ్యాయామ ఉపాధ్యాయులు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాలల క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయులు అందరు సవరించిన తేదీలను గమనించి అందరికీ తెలిపాలని వారు కోరారు.

# అమ్మవారా? వ్యాధా?



ప్రపంచంలో ప్రతి సంస్కృతి, నాగరికత మనిషికి సంక్రమించే వ్యాధులకు ఏదో రకమైన మూఢనమ్మకాలను ఆపాదిస్తూ ఉంటుంది. పూర్వకాలంలో ఈ వ్యాధుల గురించి శాస్త్రీయ అవగాహన లేనప్పుడు, వ్యాధులు దేవతల యొక్క కోప, ప్రకోపాలని భావించే వాళ్ళు. ఆ దేవతలను ప్రసన్నం చేసుకుంటే వ్యాధి తగ్గుతుందని భావించి అందుకోసం బలులిచ్చి, పూజలు, జాతరలు చేసేవాళ్లు (ఇప్పటికీ జాతరలు చాలా చోట్ల జరుగుతూనే ఉన్నాయి). తరం నుండి మరో తరానికి వారసత్వంగా వచ్చేసరికి నమ్మకాలు ప్రబలి కొండొకచో మూఢ నమ్మకాలుగా తయారవుతాయి. ఈ నమ్మకాలు ప్రజలలో ఒక భాగం అవుతాయి. మన భారతదేశంలో విస్తారమైన నమ్మక వ్యవస్థ నిర్మించబడి ఉంది. రకరకాల వ్యాధుల గురించి రకరకాల నమ్మకాలు ఉన్నాయి. అలాంటి నమ్మకాలలో ఇప్పటికి కూడా ప్రబలం గా, సజీవంగా ఉన్న వ్యాధి చికెన్ పాక్స్ (అమ్మవారు).

ఈ చికెన్ పాక్స్ వ్యాధిని 'అమ్మ పోయడం, అమ్మోరు పోయడం, అమ్మ తల్లి వచ్చింది, అమ్మోరు, ఆటలమ్మ, చిన్నమ్మ వారు, శీతాలమ్మ, మాత' ఇలా రకరకాల పేర్లతో అనేక ప్రాంతాలలో అమ్మవారి ప్రభావంగా భావిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక మూఢనమ్మకాలతో ఈ చికెన్ పాక్స్ ముడిపడి ఉంది. కానీ ప్రపంచంలో ఎక్కడా లేనన్ని అపోహలు మన దేశంలో ఈ చికెన్ పాక్స్ చుట్టూ అల్లుకొని ఉన్నాయి. మారెమ్మ, గంగమ్మలతో ముడివడి చికెన్ పాక్స్ ఆ మాతకు, తల్లికి వచ్చిన కోపంగా భావిస్తారు ('అమ్మోరు' సినిమాలో మీరు చూసే ఉంటారు). ప్రకృతిని ఆరాధించడం సర్వసాధారణం. కానీ ప్రతి సమస్యని, అనారోగ్యాన్ని కూడా నమ్మిన దేవతలతో ముడిపెట్టి చూడడం సాధారణమైపోయింది. ఈ వ్యాధి వైరస్ అనే విషయం చదువుకున్న వారికి తెలిసినా చాలామంది పసుపు నీళ్లు, పత్యాలు అని పాటిస్తూ ఉంటారు (పుస్తకాల్లో, పాఠాల్లో అది వైరస్. ఇంట్లో అయితే అమ్మవారు అది సంగతి, అదీ భయం). పల్లెల్లో అమ్మవారికి కోడిని బలి ఇవ్వడం, వ్యాధి సోకిన పిల్లలకైతే తల్లిపాలు ఇవ్వకపోవడం, పోత పాలు పట్టడం, చెవుల్లో ముక్కుల్లో నూనె చుక్కలు వేయడం, తీర్థాలు పసుపు నీళ్లు పట్టడం, వేపాకు ముద్దలు తినిపించడం లాంటివి చేస్తూ ఉంటారు.

పూజలు, బలులు, ఉపవాసాలు, జాగారాలు, దిష్టి తీయడం ఈ తతంగంలో భాగమే. చికెన్ పాక్స్ వచ్చినప్పుడు దద్దుర్లు దురద పెడుతూ ఉంటుంది. రోగిని పచ్చి వేపాకుపై పడుకోబెడితే దురద ఇంకా ఎక్కువవుతుంది. వ్యాధి సోకిన వారికి అమ్మవారి పేరుతో రోజుల తరబడి స్నానం చేయకపోతే నీటి బుడ్డలలో బ్యాక్టీరియా చేరి మరింత ప్రమాదంగా మారుతుంది. చికెన్ పాక్స్‌ని ఆటలమ్మవారు, చిన్నమ్మవారు అంటారు కదా, ఆటలాడుతే పోతుందిలే అనుకుంటారు. మూఢనమ్మకాలతో వైద్యం చేయించకపోతే ఇతర సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు బిడ్డ మరణించే ప్రమాదం కూడా ఉంది. చికెన్ పాక్స్ సాధారణంగా పిల్లల్లో కంటే పెద్దవాళ్లలో తీవ్రంగా ఉంటుంది. ఓ మోస్తరుగా పసుపు యాంటిసెప్టిక్‌గా ఉపయోగపడుతుంది. కానీ దురద నుండి ఉపశమనం ఇవ్వదు. ఈ వ్యాధి సోకినప్పుడు శరీరం, చర్మం, పక్క బట్టలను శుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరానికి, దురదకు వైద్యులు సూచించిన మందులను వాడాలి. పిల్లల గోళ్లు కత్తిరించి, పలుచని బట్టలు చేతికి చుడితే వాళ్ళు గోకేసుకోకుండా ఉంటారు. తేలికగా అరిగే బలవర్ధకమైన ఆహారం వ్యాధి సోకిన వారికి ఇవ్వాలి. అంతేగాని ఉపవాసం ఉండకూడదు.

శాస్త్రం ఏం చెప్తుంది అంటే ఈ చికెన్ పాక్స్ 'వరిసెల్లో జోస్టర్ వైరస్' వల్ల కలిగే అంటువ్యాధి. ఈ వ్యాధి సోకినప్పుడు చిన్న దురద బొబ్బలను ఏర్పరిచే చర్మపు దద్దుర్లు ఏర్పడతాయి. అవి చర్మాన్ని కప్పివేస్తాయి. ఛాతీ, వీపు, ముఖంపై ప్రారంభమవుతుంది. తర్వాత శరీరంలోని మిగిలిన భాగాలకు వ్యాపిస్తుంది. దద్దుర్లతో పాటు జ్వరం, అలసట, తలనొప్పి వంటి ఇతర లక్షణాలు ఉంటాయి. ఐదు రోజుల నుంచి ఈ ఏడు రోజులు వరకు దీని ప్రభావం ఉంటుంది.

ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తి నోటి నుండి వెలువడే తుంపర్ల ద్వారా, శరీరంపై ఉన్న నీటి పొక్కుల స్రావాల ద్వారా పక్క నున్న వారికి ఈ వైరస్ వ్యాపిస్తుంది. ఎండిపోయి చెక్కు కట్టిన చర్మం వల్ల హాని లేదు. ఇలాగా ఈ అంటి వ్యాధి పట్ల జాగ్రత్త వహించి సరైన చికిత్స చేయించాలి. అభివృద్ధి చెందిన దేశాల లో చికెన్ పాక్స్‌కి వ్యాక్సిన్లు 1990లో వాడకంలోకి వచ్చింది.

గత పదేళ్లుగా మనం దేశంలో కూడా వారిసెల్లో వ్యాక్సిన్ వాడుకలోకి వచ్చింది. ప్రభుత్వాలు ఉచిత టీకాల జాబితాలో దీనిని చేర్చకపోయినా విరివిగా అందుబాటులో ఉంది.

ఈ అమ్మవార్ల గురించి మరొక విషయం మీకు చెప్పాలి. నా చిన్నప్పుడు అంటే దాదాపు 1976 ప్రాంతంలో మా ఊర్లో గోడల పైన స్టెన్సిల్ కటింగ్ రేకు ఫ్రేములపై నీలిమందు రంగు పూసి ఓ ప్రకటనను గోడలపై రాశారు. పూర్తి ప్రకటన గుర్తు లేకపోయినా విషయం గుర్తుంది. అదేమిటంటే "పెద్దమ్మ వారు.. మసూచి ఆనవాళు తెలిపిన వారికి వెయ్యి రూపాయల బహుమతి" అని. అదేదో ఆనవాళ్లు కనిపెట్టేసి, చెప్పేసి ఆ బహుమతి ఏదో నాకే వస్తే బాగుండునని ఆశ నాకు కలిగింది. కొన్నాళ్ళకి ఆ బహుమతిని పది వేల రూపాయలు దాకా పెంచారు (ఎంత పొగరు వీళ్లకు?! అనుకున్నా. అది పొగరు కాదని, సైన్స్ ఇచ్చిన భరోసా అని తర్వాత అవగాహన కలిగింది). అప్పట్లో "ఆ పెద్దమ్మ వారు ఎవరో, మాకు ఎవరికి కనిపించకుండా ఎక్కడ దాక్కున్నారో?? 'ఏదో నాకు గాని నా స్నేహితులకు గాని ఆ మాటకొస్తే మా ఊరిలో ఎవరికీ దొరకలేదు. బహుమతి కూడా అందలేదు. అది వేరే సంగతి అనుకోండి.

తర్వాత తర్వాత తెలిసింది. పెద్ద అమ్మవారు అంటే అతి భయంకరమైన అంటు వ్యాధి అయిన "మసూచి" అని (పెద్దమ్మవారు, స్ఫోటకం, స్మాల్ పాక్స్ అని కూడా అంటారు). ఆ "పెద్ద అమ్మవారిని" ఈ భూమండలం నుండి తొలగించారని, నిర్మూలించారని, ఇకపై ఆ వ్యాధి ఎవరిని బాధించదని తెలిసింది.

దాదాపు మూడు వేల సంవత్సరాలుగా ప్రపంచాన్ని గడగడలాడించి, కోట్ల మందిని పొట్టను పెట్టుకున్న "మసూచి" (స్మాల్ పాక్స్) అంటువ్యాధి నిరోధించడానికి డాక్టర్ ఎడ్వర్డ్ జెర్నర్ 1796లో వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. ఆ వ్యాక్సిన్ గురించి పూర్తిగా ప్రజలకు అర్థమై, అవగాహన చేసుకొని, నమ్మకం పెంచుకొని, వ్యాక్సిన్ అందుబాటులో వచ్చి, అందరూ వ్యాక్సిన్ తీసుకొని ఆ వ్యాధిని పూర్తిగా తొలగించడానికి దాదాపు 200 ఏళ్లు పట్టింది. అంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత 1980లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఒ) భూమిపై మసూచి వ్యాధి పూర్తిగా తొలగి పోయిందని ప్రకటించింది. అంటే ఇకపై భూమిపై ఎవరికి మసూచి వచ్చే అవకాశం లేదన్నమాట.

ఇలాగే రానున్న కాలంలో చికెన్ పాక్స్‌ను కూడా ఈ భూమిపై నుండి పంపించవచ్చు. కాబట్టి ఇవన్నీ వ్యాధులే తప్ప అమ్మవారి కోపతాపాలు, ఆటలు కాదని ప్రజలు గ్రహించాలి. మఠాధిపతులైనా, పీఠాధిపతులైనా, బాబాలైనా జబ్బు వస్తే డాక్టర్ని సంప్రదించాలి తప్ప మంత్రాలు, తాయెత్తులు, పూజలతో, పవిత్ర జలాలతో, ప్రార్థనలతో, యజ్ఞ యాగాదులతో ఎవరూ నయం చేయలేరని చరిత్ర నిరూపించింది. 'కరోనా' దాన్ని మరొకసారి బల్లగుద్ది ప్రపంచానికి చాటి చెప్పింది.

# 'తులసి'తో జ్ఞాపకశక్తి మెరుగు



**భారతీయులు పవిత్రంగా భావించే 'తులసి' ఇప్పటికే మన దేశం లో ఆయుర్వేద ఔషధాల్లో ప్రసిద్ధి చెందింది. అయితే, మనుషుల సంపూర్ణ ఆరోగ్యానికి 'తులసి' దోహదపడుతున్నదని 'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' తన పరిశోధనలో తేల్చింది. తులసి జ్ఞాపకశక్తిని మెరుగుపర్చడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తున్నట్టు తాజాగా వెల్లడించింది. దీంతో తులసి మొక్క ప్రాముఖ్యత గ్లోబల్ స్థాయికి చేరినట్లయింది.**

**జీవన క్రియల పెంపు**

**ఒత్తిడి తగ్గించడంతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది**

**గుండెపోటు రిస్క్ తగ్గుదల**


**'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' వెల్లడి**

హైదరాబాద్, : తులసి వివిధ రకాల ఒత్తిళ్లను తగ్గించడంతో పాటు రద్దీ ప్రదేశాల్లో నివాసం ఉండేవారిని కాలుష్యం నుంచి కాపాడుతున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. పనిచేయడం వల్ల కలిగే శ్రమ, చలి, పెద్ద శబ్దాల నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు శరీర సమతుల్యతకు తోడ్పాటు అందిస్తున్నట్టు పేర్కొంది. బీపీ, రక్తంలో చక్కెరలు, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను తగ్గిస్తున్నట్టు పరిశోధనలో తేలింది. డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతున్నదని తెలిపింది. రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడంతో పాటు లిపిడ్ ప్రొఫైల్‌ను మెరుగుపర్చడం, మానవ శరీరంలోని జీవన క్రియలను పెంపొదిస్తున్నట్టు ఆ నివేదిక వెల్లడించింది.

తులసితో మరిన్ని ప్రయోజనాలు ఇలా..: యాంటీ బ్యాక్టరీయా గుణాలు ఉన్న తులసి అనేక రకాల వైరస్‌లతో పోరాడుతున్నదని, జలుబును నివారించడంతోపాటు హ్యాండ్ శానిటైజర్, మౌత్ వాష్‌గా పనిచేస్తున్నట్టు ఆ పరిశోధనలో వెల్లడైంది. యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా రోగాల బారిన పడకుండా కాపాడుతున్నదని నివేదిక పేర్కొంది. మనిషి సానుకూల దృక్పథంతో ఉండేందుకు, ఆందోళన, డిప్రెషన్‌కు గురికాకుండా పనిచేస్తున్నట్టు తెలిపింది. మనిషిలో ఒత్తిడిని తగ్గించేందుకు మెదడులోని రసాయనాలైన డొపమైన్, సెరొటొనిన్‌ను బ్యాలెన్స్ చేస్తున్నట్టు నివేదిక స్పష్టం చేసింది. మన దైనందిన జీవనంలో రేడియేషన్ల వల్ల కలిగే నష్టం నుంచి మన శరీరాన్ని రక్షించడంలో తులసి సహాయపడుతుందని, హాని కలిగించే పదార్థాల నుంచి కాపాడటంలో భాగంగా కాలేయ ఎంజైమ్‌ల ఉత్పత్తికి తోడ్పాటునందిస్తున్నట్టు నివేదిక వెల్లడించింది. ఈ చర్యతో మన శరీరంలో డీఎన్ఏకు కలిగే నష్టాన్ని తగ్గించి జీవకణాల ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్నట్టు స్పష్టం చేసింది. తులసిలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామెటరీ, యాంటీయాక్సిడెంట్ల కారణంగా గాయాలను త్వరగా తగ్గిస్తుందని పేర్కొంది. అల్సర్ నిరోధక ప్రభావాలు కలిగి ఉండటం, జీర్ణక్రియ సమస్యలు, కడుపునొప్పి, వాంతులు, విరేచనాల నుంచి ఉపశమనం కలిగిస్తున్నట్టు తెలిపింది. రక్తంలోని లిపిడ్‌ను తగ్గించడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడటంతో పాటు గుండెపోటు రిస్క్‌ను తగ్గిస్తుందని 'అమెరికా నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్' తన పరిశోధనలో వివరించింది.

# బొద్దింకలు వ్యాధుల కారకాలు

బొద్దింకల్ని చూడగానే చిరాకు పుడుతుంది. ఈ విషయం అలా ఉంచితే బొద్దింకలు ఎన్నో వ్యాధులకు కారణమవుతాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులు, వృద్ధులు బొద్దింకల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. వీటి ద్వారా వ్యాపించే కొన్ని ముఖ్యమైన వ్యాధుల గురించి తెలుసుకుని ఉండాలి.ఫుడ్ పాయిజనింగ్: అపరిశుభ్ర వాతావరణంలో తిరిగే బొద్దింకలు తాకితే మనం తాగేనీళ్ల, తినే ఆహారం కలుషితమవుతాయి. దీంతో ఫుడ్ పాయిజనింగ్ జరుగుతుంది. దీనివల్ల కడుపునొప్పి, వాంతులు, డయేరియా (అతిసారం), జ్వరం లాంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్ (ఓఆర్ఎస్)తో తగ్గించుకోవచ్చు. కొన్ని సందర్భాల్లో యాంటిబయాటిక్స్ అవసరమూ ఉంటుంది.టైఫాయిడ్: బొద్దింకల నుంచి వచ్చే వ్యాధుల్లో తీవ్రమైనది టైఫాయిడ్. ఇది సాల్మొనెల్లా టైఫి అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. కలుషిత జలం తాగినప్పుడు, కలుషిత ఆహారం తిన్నప్పుడు ఈ క్రిమి మన శరీరాల్లో చేరిపోతుంది. తీవ్రమైన జ్వరం, బలహీనత, తలనొప్పి, కొన్నిసార్లు మలబద్ధకం, ఇంకొన్నిసార్లు డయేరియా (అతిసారం).. ఇవి టైఫాయిడ్ లక్షణాలు. క్రిమి సోకిన 12 నుంచి 72 గంటల్లో టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తాయి. తగినంత విశ్రాంతి, యాంటిబయాటిక్స్‌తో దీన్నుంచి విముక్తి పొందొచ్చు.కలరా: బొద్దింకల నుంచి వ్యాపించే మరో వ్యాధి కలరా.



అపరిశుభ్రమైన పరిసరాల కారణంగా కలరా సోకుతుంది. అతిసారం, నీళ్ల విరేచనాలు, వాంతులు మొదలైనవి దీని లక్షణాలు. డీహైడ్రేషన్ సమస్య ఉంటే ఐవీ ఫ్లూయిడ్స్, యాంటిబయాటిక్స్ అవసరమవుతాయి. పరిశుభ్రతే ప్రధానం: బొద్దింకల మూలంగా వ్యాధులు రాకూడదనుకుంటే ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహారంపై మూతలు పెట్టాలి. చెత్తబుట్టలను క్రమం తప్పకుండా కడిగి శుభ్రం చేస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి పెస్ట్ కంట్రోల్ చేయిస్తూ ఉండాలి. చికిత్స కంటే వ్యాధి రాకుండా నివారించుకోవడం ఉత్తమం. అనుకోకుండా బొద్దింకల వల్ల ఫుడ్ పాయిజనింగ్ లాంటి సమస్యలు, ఇతర లక్షణాలు కనిపిస్తే సత్వరమే వైద్య సహాయం పొందాలి.

# ఆవాలలో దాగి ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు..!



ఆవాల గురించి అందరికీ తెలిసిందే. వీటిని మనం ఎంతో కాలం నుంచే వంట ఇంటి పోపు దినుసులుగా ఉపయోగిస్తున్నాం. ఆవ పిండిని ఊరగాయల తయారీలో ఉపయోగిస్తారు. అయితే ఆవాలను కేవలం వంటల్లో ఇలా ఉపయోగిస్తారు కానీ అవి అందించే ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం ఎన్నో ఉన్నాయి. ఆవాల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఆవాల్లో మెగ్నిషియం, క్యాల్సియం, మాంగనీస్, జింక్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, ఫైబర్ ఉంటాయి.

ఆవాలు ఘాటైన వాసనను కలిగి ఉంటాయి. వీటిని ఆయుర్వేదంలో పలు ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. ఆరోగ్య పరంగా ఆవాలు మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి. ఆవాలలో ఫైటో న్యూట్రియెంట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ప్రతి 100 గ్రాముల ఆవాల్లో సుమారుగా 9.82 మిల్లీ గ్రాముల టోకోఫినా ల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది విటమిన్ ఇ లా పనిచేస్తుంది.

**గుండె ఆరోగ్యంగా..:** ఆవాలలో ఉండే టోకోఫినాల్ వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కనుకనే ఆవనూనెను వంటల్లో ఉపయోగించాలని ఆయుర్వేద వైద్యులు చెబుతుంటారు, ఇది గుండెకు సంరక్షణను అందిస్తుంది. గుండె పోటు రాకుండా చూస్తుంది. ఆవాల్లో సెలీనియం అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ఊపిరితిత్తుల సమస్యలను, వాపులను తగ్గిస్తుంది. పోపు దినుసులుగా ఆవాలను ఉపయోగిస్తే అవి ఆకలిని పెంచుతాయి. ఆహారం సరిగ్గా జీర్ణం అయ్యేట్లు చేస్తాయి. గొంతు నొప్పి, దగ్గు, జ్వరం వంటి సమస్యలు ఉన్నప్పుడు మరుగుతున్న నీళ్లలో చిటికెడు ఆవాల పొడి, తగినంత తేనె వేసి ఇస్తే సమస్యలు నియంత్రణలో ఉంటాయి. ఆవాల్లో క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడే గుణాలు ఉంటాయి.

**పాదాల నొప్పులకు..:** ఆవాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త ప్రసరణను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఆవాలను దంచి వాపు ఉన్న ప్రదేశంలో వేసి కట్టులా కడుతుంటే నొప్పులు, వాపులు తగ్గుతాయి.

ముఖ్యంగా గౌట్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అర బకెట్ వేడి నీటిలో ఒక టీస్పూన్ ఆవాల పొడి వేసి కాళ్లను కొద్ది సేపు అందులో ఉంచాలి. దీంతో పాదాల నొప్పులు తగ్గుతాయి. తెల్ల ఆవనూనె చర్మ రంగును మెరుగు పరుస్తుంది. దీన్ని శరీరానికి బాగా పట్టించి మర్దనా చేయాలి. కాసేపు అయ్యాక స్నానం చేయాలి. తరచూ ఇలా చేస్తుంటే చర్మం మంచి రంగును పొందుతుంది. చర్మానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది.

**సమృద్ధిగా పోషకాలు..:** కొబ్బరినూనెలో ఆవనూనెను కలిపి శిరోజాలకు రాస్తుండాలి. దీంతో అన్ని రకాల జుట్టు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి.

ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టు చిట్లడం తగ్గుతుంది. చుండ్రు నుంచి బయట పడవచ్చు.

100 గ్రాముల ఆవాలలో తేమ 6.5 గ్రాములు, పొటాషియం 20.3 మిల్లీగ్రాములు, కొవ్వులు 39.7 గ్రాములు, ఫైబర్ 4.8 గ్రాములు. పిండి పదార్థాలు 23.8 గ్రాములు, క్యాల్షియ 490 మిల్లీగ్రాములు, ఫాస్ఫరస్ 700 మిల్లీగ్రాములు, ఐరన్ 7.9 మిల్లీగ్రాములు, టోకోఫినాల్ 9.82 మిల్లీగ్రాములు ఉంటుంది. 100 గ్రాముల ఆవాలతో మనకు సుమారుగా 540 క్యాలరీల శక్తి లభిస్తుంది. ఆవాల ద్వారా మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలిగే మాట వాస్తవమే అయినప్పటికీ వేడి శరీరం ఉన్నవారు వీటిని తీసుకోరాదు. ఆవాలను చాలా తక్కువ మోతాదులో వాడుకుంటే ఎక్కువ ఫలితం పొందవచ్చు.

# మంచి ఆలోచనలే శ్రీరామరక్ష..

చెడు వ్యసనాలు వదిలి నిర్మల మనస్సుతో ఉన్నంత కాలం మనలను ఏ మలినం ఆవరించదు. ఓ రకంగా నిర్మలమైన మనస్సు ఆరోగ్యానికి హేతువు.మన మనస్సు చేసే మంచి ఆలోచనలతోనే మన దేహం కూడా అదుపులో ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటుంది. చెడు ఆలోచనలను మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. ఇకపోతే ఇది సత్యం. సత్యం కఠినంగానే ఉంటుంది. మనిషి సత్యవచస్సులోని ఆంతర్యాన్ని తెలుసుకొని ఆచరిస్తే, ఆ కఠినవచస్సు అమృతమయం అవుతుంది. అనేక వ్యసనాలకు మనిషి బానిస అవుతాడు. అలాంటివాడికి వ్యసనాలను మానుకొమ్మని చెప్పే మాటలు రుచించవు. నిప్పుల్లోకి దూకే మిడతకు ఆ నిప్పు కాల్చివేస్తుందనే సత్యం తెలియదు. అలాగే వ్యసనాలకు లోనైన మనిషికి వాటి పర్యవసానం ఎలా ఉంటుందో తెలియదు. వ్యసనపరుడికి తాత్కాలికంగా లభించే ఆనందం, సుఖమే నచ్చుతాయి. అందుకే వ్యసనపరులు వ్యసనపరులతోనే సహవాసం చేస్తారు. మంచివాళ్లు చెప్పే మాటలు వారి చెవులకు శూలాల్లా గుచ్చుకొంటాయి. గాడిదకు గంధం వాసన తెలియనట్లు, పందికి పరమాన్నపు రుచి తెలియనట్లే- వ్యసనపరుడికి హితవచన మహిమ తెలియదు. మనిషి బాగుపడాలం టే పెద్దలపట్ల భయమైనా ఉండాలి, లేదా మంచి విషయాలపై భక్తి అయినా ఉండాలి. భయం కాని, భక్తి కాని లేని మనిషి తెగిన గాలిపటంలా ఎక్కడ పతనమవుతాడో ఎవరికీ తెలియదు. చేతులు కాలాక ఆకులు పట్టుకొన్న చందంగా, మనిషి అధోగతిపాలైన తరవాత జ్ఞానోదయమైనా- చేయగలిగిందేమీ ఉండదు. మనిషికి భాగ్యదాయక క్షణాలు ఎప్పుడో కానీ రావు. అలా వచ్చినవాటిని చక్కగా ఉపయోగించుకొనేవాడికి జీవితం ఆనంద బృందావనం అవుతుంది. ఎవరో రావాలని, ఏదో చేయాలని భ్రమలో మునిగిపోతూ కర్తవ్యాన్ని మరచే మనిషిని దేవుడు కూడా బాగుపరచలేడు.

# ఈ ఆహారాలను తీసుకుంటే తెల్ల రక్త కణాల సంఖ్యను గణనీయంగా పెంచుకోవచ్చు..




సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టాలన్నా, ఇతర రోగాలు రాకుండా శరీరాన్ని రక్షించాలన్నా మన రోగ నిరోధక వ్యవస్థ ఎంతో పనిచేస్తుంది. నిత్యం సూక్ష్మ క్రిములు శరీరంలో చేరి రోగాలను కలగజేయకుండా అడ్డుకుంటుంది. అందుకు గాను ఆ వ్యవస్థ నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటుంది. ఈ క్రమంలోనే సూక్ష్మ క్రిములను నశింపజేయడంలో తెల్ల రక్త కణాలు ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తాయి. మన శరీరంలో తెల్ల రక్త కణాల సంఖ్య సరిగ్గా ఉంటేనే రోగాలు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. రోగ నిరోధక వ్యవస్థ ఎల్లప్పుడూ తెల్ల రక్త కణాలను ఉత్పత్తి చేస్తూనే ఉంటుంది. క్రిములతో పోరాడే తెల్ల రక్త కణాలు నశిస్తాయి. దీంతో వాటి స్థానంలో కొత్త కణాలను రోగ నిరోధక వ్యవస్థ ఉత్పత్తి చేస్తుంది. అయితే అలా తయారు చేయాలంటే రోగ నిరోధక వ్యవస్థకు అవసరం అయిన పోషకాలను మనం అందించాలి. అప్పుడే తెల్ల రక్త కణాల సంఖ్య పెరుగుతుంది. దీంతో రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు. ఇక తెల్ల రక్త కణాల ఉత్పత్తికి గాను రోగ నిరోధక వ్యవస్థకు అవసరం అయిన పోషకాలను అందించేందుకు మనం కొన్ని రకాల ఆహారాలను రోజూ తీసుకోవాల్సి ఉంటుంది. వీటి వల్ల రోగ నిరోధక వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది.

విటమిన్ ఇ, జింక్..: విటమిన్ ఇ ఉన్న ఆహారాలను తింటుంటే రోగ నిరోధక వ్యవస్థకు కావల్సిన బలం లభిస్తుంది. దీంతో తెల్ల రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. మనకు రోజుకు దాదాపుగా 60 మిల్లీగ్రాముల మోతాదులో విటమిన్ ఇ లభించాలి. ఇందుకు గాను విటమిన్ ఇ అధికంగా ఉండే బాదంపప్పు, అవకాడో, కొత్తిమీర, చేపలు, గుమ్మడికాయ విత్తనాలు, అవిసె గింజలు వంటి ఆహారాలను తింటుండాలి. వీటిని తింటుంటే తెల్ల రక్త కణాల సంఖ్య పెరుగుతుంది. రోగాలు రాకుండా ఉంటాయి. జింక్ ఉండే ఆహారాలను రోజూ తింటున్నా కూడా తెల్ల రక్త కణాల సంఖ్య పెరుగుతుంది. జింక్ మనకు రోజుకు సుమారుగా 20 మిల్లీగ్రాముల మోతాదులో అవసరం అవుతుంది. సముద్రపు ఆహారం, తృణ ధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తులు, గుమ్మడికాయ విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలను తినడం వల్ల జింక్ లభిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

## రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు..

సెలినియం, విటమిన్ సి..: సెలినియం మనకు రోజుకు 200 మైక్రోగ్రాముల మోతాదులో కావాలి. ఇది కూడా రోగ నిరోధక వ్యవస్థ పనితీరుకు సహాయం చేస్తుంది. చేపలు, చికెన్, యాపిల్ పండ్లు, వెల్లుల్లి, టమాటాలు, గుమ్మడికాయ విత్తనాలను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తెల్ల రక్త కణాలు అధికంగా ఉత్పత్తి అవుతాయి. రోగాలు రాకుండా ఉంటాయి. రోజూ గ్రీన్ టీని సేవిస్తున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇది శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. తెల్ల రక్త కణాల సంఖ్య పెరిగేలా చేస్తుంది. విటమిన్ సి వల్ల మన శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తెల్ల రక్త కణాల సంఖ్య రెట్టింపు అవుతుంది. వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. నారింజ, కివిలు, నిమ్మకాయలు, క్యాప్సికం, పైనాపిల్, బొప్పాయి తినడం వల్ల విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, విటమిన్ ఎ..: టమాటాలు, నారింజ, బొప్పాయి, చిలగడదుంపలు, క్యారెట్లు, యాపిల్స్ వంటి ఆహారాల్లో కెరోటినాయిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అయ్యేలా చూస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. దీని వల్ల రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. చేపలు, అవిసె గింజెలు, నట్స్‌లలో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి తెల్ల రక్త కణాల సంఖ్య పెరగడంలో దోహదపడతాయి. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. విటమిన్ ఎ అధికంగా ఉండే యాపిల్ పండ్లు, క్యారెట్లు, పాలకూర వంటి ఆహారాలను తింటున్నా కూడా మేలు జరుగుతుంది. తెల్ల రక్త కణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఇవి మనకు రోగాలు రాకుండా చూస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేస్తాయి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలా ఆయా ఆహారాలను తింటుంటే తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచుకుని రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# కుంగుబాటు ఆమెలోనే అధికం



చాలామంది ఏదో ఒక సమయంలో డిప్రెషన్‌కు గురవుతుంటారు. అయితే దీని ప్రభావం పురుషులకంటే మహిళలల్లోనే అధికంగా ఉంటుందని జన్యు పరిశోధనలో వెల్లడైంది. ఆస్ట్రేలియాకు చెందిన క్యూఐఎంఆర్ బెర్గ్ హొఫర్ మెడికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం ఈ విషయాన్ని నిర్ధారించింది. మహిళలు, పురుషులు డిప్రెషన్‌ను అనుభవించే విధానంలో ఉన్న జన్యు వ్యత్యాసాలను గుర్తించింది. ఈ పరిశోధన మేరకు మహిళల డీఎన్‌ఏలో డిప్రెషన్‌కు సంబంధించిన జన్యు ఫ్లాగ్‌లు లేదా సంకేతాలు పురుషుల కంటే రెండింతలు ఎకువగా ఉన్నాయని తేలింది. సుమారు 13,000 డీఎన్‌ఏ మార్పులను గుర్తించిన పరిశోధక బృందం.. వీటిలో పురుషులు, మహిళల్లో కలిపి 7,000 మార్పులను గమనించారు. మరో 6,000 మార్పులు కేవలం మహిళల్లోనే ఉన్నట్లు వెల్లడయ్యాయి.

ఈ అధ్యయనంలో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు, పురుషుల డీఎన్‌ఏలను విశ్లేషించగా 1.30 లక్షల మహిళలు, 65 వేల పురుషులు మానసిక కుంగుబాటుతో సతమతమవుతున్నారని గుర్తించారు. డిప్రెషన్ ఉన్న మహిళల్లో జీవక్రియల్లో, బరువులో మార్పులు గమనించారు. అంతేకాదు వారి శక్తి స్థాయిలు కూడా గణనీయంగా తగ్గాయట. ఇప్పటివరకు ఎకువ మందుల ప్రయోగాలు, థెరపీ పరీక్షలు పురుషులపైనే జరగడం వల్ల మహిళా రోగులపై సరైన అవగాహన లేదని, ఈ పరిశోధనతో భవిష్యత్తులో మహిళల మానసిక ఆరోగ్యానికి ప్రత్యేక చికిత్సలు, థెరపీలు రూపుదిద్దుకునే అవకాశం ఉంటుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

## నిమ్మరసాన్ని పరగడుపునే సేవిస్తే

# ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

## దీన్ని ఎవరు తాగకూడదు..?



నిమ్మకాయలను మనం తరచూ అనేక వంటకాలలో ఉపయోగిస్తూనే ఉంటాం. నిమ్మరసాన్ని పలు వంటకాల్లో వాడుతారు. దీంతో వంటకాలకు చక్కని రుచి, రంగు వస్తాయి. ఇక ఆయుర్వేద ప్రకారం నిమ్మ మనకు అనేక లాభాలను అందిస్తుంది. నిమ్మరసంలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. నిమ్మరసాన్ని రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు కలుగుతాయి. పలు వ్యాధులను సైతం నయం చేసుకోవచ్చు. అయితే నిమ్మరసాన్ని తాగే విషయంలో చాలా మందికి అనేక సందేహాలు ఉంటాయి. వాటి గురించి ఆయుర్వేద వైద్యులు ఏమని సమాధానాలు చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నిమ్మరసం ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటుంది కనుక ఉదయం పరగడుపున తాగవచ్చా..? అని చాలా మంది సందేహిస్తుంటారు. అయితే ఇందుకు వైద్యులు ఏమంటున్నారంటే..

వీరు తాగకూడదు..: ఆరోగ్యవంతమైన వ్యక్తులు నిమ్మరసాన్ని తాగవచ్చు. పరగడుపున తాగినా దుష్పరిణామాలు కలగవు. కానీ పలు రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం నిమ్మరసాన్ని పరగడు పున తాగకూడదు. ముఖ్యంగా అసిడిటీ, అల్సర్, కడుపు నొప్పి, పొట్టలో అసౌకర్యం ఉన్నవారు నిమ్మరసాన్ని పరగడుపున తాగకూ డదు. జీర్ణాశయ సంబంధిత మెడిసిన్లను వాడేవారు కూడా నిమ్మరసా న్ని పరగడుపున సేవించకూడదు. అయితే నిమ్మరసం దంతాల ఎనామిల్‌పై ప్రభావం చూపిస్తుంది. కనుక దీన్ని నేరుగా తాగకూడదు. కచ్చితంగా నీటిలో కలిపి సేవించాల్సి ఉంటుంది. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ నిమ్మరసం కలిపి ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కు 30 నిమిషాల ముందు తాగాల్సి ఉంటుంది. ఇలా నిమ్మరసాన్ని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

డీహైడ్రేషన్ రాకుండా..: నిమ్మరసాన్ని పరగడుపునే సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా పనిచేస్తుంది. జీర్ణ రసాల ఉత్పత్తి మెరుగు పడుతుంది. పైత్య రసాలు సక్రమంగా ఉత్పత్తి అవుతాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. నిమ్మరసాన్ని సేవించడం వల్ల గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం తగ్గిపోతాయి. నిమ్మరసాన్ని ఉదయం సేవిస్తుంటే శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. రోజంతా బయట తిరిగేవారు లేదా పనిచేసేవారు ఉదయం నిమ్మరసాన్ని సేవిస్తుంటే శరీరంలోని నీరు బయటకు వెళ్లకుండా ఉంటుంది. ఎలక్ట్రోలైట్స్ సమస్థితిలో ఉంటాయి. దీని వల్ల శరీరంలో వేడి చేరదు. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. నీరసం, అలసట రావు.

రోగ నిరోధక వ్యవస్థకు..: నిమ్మరసంలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. మన చర్మానికి నిమ్మరసం చేసే మేలు అంతా ఇంతా కాదు. ఇందులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. దీని వల్ల చర్మ కాంతి మెరుగు పడుతుంది. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. చర్మ కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు, ముడతలు తగ్గిపోతాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా నిమ్మరసం ఎంతో మేలు చేస్తుంది. నిమ్మరసాన్ని రోజూ సేవిస్తుంటే జీర్ణశక్తి పెరిగి మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. ఇలా నిమ్మరసాన్ని సేవించడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అలర్జీలను నిర్లక్ష్యం చేస్తే..



వానాకాలం ముగింపునకు వచ్చింది.. శీతకాలం ప్రవేశిస్తున్నది. చలికాలంలో చల్లని గాలులే కాదు చుట్టూ కాలుష్యమూ ఇబ్బందిపెడుతుంది. ఈ శీతల గాలుల కారణంగా అసాధారణమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చలి, వాయు కాలుష్యం వల్ల అనేక రకాల అలర్జీలు దాడి చేస్తాయి. అయితే అలర్జీల సమస్య అంత తీవ్రంగా ఉండకపోవచ్చు. కాబట్టి, చాలామంది చికిత్స గురించి ఆలోచించరు. కానీ, ఇలా నిర్లక్ష్యం చేస్తే.. రకరకాల సమస్యలు ఉత్పన్నం అవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలర్జీలను పట్టించుకోకపోతే.. అవి దీర్ఘకాలిక సైనసైటిస్ సమస్యకు దారి తీయొచ్చు. చెవుల్లో ఇన్‌ఫెక్షన్, ఆస్తమా, నిద్రలేమి, తలనొప్పి, కళ్లమంట తదితర సమస్యలను నిర్లక్ష్యం చేస్తే.. ఇవి జీవనశైలిపై ప్రభావం చూపి ఇతర రోగాలకు దారితీయొచ్చు. కాబట్టి అలర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు. ఈ సీజన్‌లో తరచుగా జలుబు చేయడం, ముక్కులో దురద, తుమ్ములు, కళ్లు ఎర్రబారడం, కళ్ల దురద, గొంతులో నొప్పి, దగ్గు, అలసట, ముఖం ఉబ్బరించడం లాంటి సమస్యలు తలెత్తితే చల్లని గాలికి దూరంగా ఉండాలి. దుమ్ము పీల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లని ఆహారం తీసుకోకూడదు. అలర్జీని ఎదుర్కొనేందుకు పండ్లు, పోషకాలు అధికంగా ఉండే డ్రైఫ్రూట్స్ తీసుకోవాలి. తరచుగా ఈ సమస్యలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే అలర్జీ పరీక్ష చేయించుకోవాలి.


# పుట్టిన బిడ్డకు గుండెలో ట్యూమరా?

మా తమ్ముడికి పాప పుట్టింది. తల్లి కడుపులో ఉన్నప్పుడే.. బిడ్డ గుండెలో ఒక ట్యూమర్ మాదిరిగా ఉందని వైద్యులు చెప్పారు. కాకపోతే, దానివల్ల ఎలాంటి ఇబ్బంది లేదని, పుట్టిన తర్వాత పరీక్షలు చేయాల్సి వస్తుందని, అవసరమైతే చికిత్స ఇవ్వాలని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన తరవాత స్కానింగ్‌లో గుండె గదిలో ట్యూమర్ ఉన్నట్టుగా గమనించారు. వైద్యుల సిఫారసు మేరకు జెనటిక్ టెస్ట్ చేయిస్తే.. బిడ్డకుట్యుబరస్ క్లిరోసిస్ ఉందని నిర్ధారణ అయింది. ఇంతకీ ట్యుబరస్ క్లిరోసిస్ అంటే ఏమిటి? గుండెలో ఈ ట్యూమర్ ప్రమాదకరమా? సరైన సలహా ఇవ్వగలరు. మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ తమ్ముడి పాపకు ఉత్పన్నమైన సమస్య ట్యుబరస్ క్లిరోసిస్ కావొచ్చు. ఇది ఒక జన్యుపరమైన సమస్య. ఇది ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా లక్షణాలు చూపుతుంది. కొంతమంది పిల్లల్లో ముఖం మీద చిన్న చిన్న ట్యూమర్స్ లాగా (మొద్దుగా కనిపించే మొటిమలు) కనిపిస్తాయి. కొన్ని పాలిపోయినట్టుండే ప్యాచెస్ రావొచ్చు. ఎక్కువ మందిలో ఫిట్స్ రావడం జరుగుతుంది. ఈ ఫిట్స్ కొన్నిసార్లు అదుపులోకి రాకపోవచ్చు. శరీరం లోపల అవయవాల్లోనూ ట్యూమర్స్ ఏర్పడవచ్చు. పుట్టుకతోనే గుండెలో ర్యాబ్డోమయోమా అనే ట్యూమర్ కూడా రావొచ్చు. చాలా సందర్భాల్లో ఈ ట్యూమర్ దానంతట అదే కరిగిపోతుంది. గుండెలో రక్తం ప్రవహించే దారిని బ్లాక్ చేయనంత వరకు ఈ ట్యూమర్ మరీ ప్రమాదకరమైనది కాదు. తల్లి కడుపులో ఉన్నప్పుడే ట్రీట్‌మెంట్ చేసే వెసులుబాటు ఉంది. మీ విషయంలో అలాంటి పరిస్థితి లేదనిపిస్తుంది. క్రమం తప్పకుండా పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌ను సంప్రదించడం అవసరం. అలాగే పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్‌కు కూడా పాపను చూపించండి. బిడ్డ ఎదుగుదలను పీడియాట్రీషన్ ద్వారా క్రమం తప్పకుండా చెక్ చేయించుకోవడం అవసరం. ఈ సమస్య ఉన్న పిల్లల్లో చాలావరకు అందరిలాగానే ఎదగడం, తమ పనులు చేసుకోవడం జరుగుతుంది. కానీ, రెగ్యులర్ చెకప్‌లు అవసరం. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే దానికి అనుగుణంగా చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. భవిష్యత్తులో అందరిలాగా మామూలు జీవితం గడపవచ్చా అంటే.. సరైన జాగ్రత్తలు తీసుకుంటూ, డాక్టర్ సలహాలు పాటిస్తూ, అవసరమైన మందులు సమయానుకూలంగా వాడుకున్నట్లయితే సాధారణమైన జీవితాన్ని గడపవచ్చు. మీ తమ్ముడి పాప విషయంలో తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదన్న దాన్ని బట్టి%ౌ% భవిష్యత్తు ఉంటుంది. ఆందోళన చెందకుండా పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్‌ని, పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్‌ని సంప్రదించండి.



–డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

# కాలేయాన్ని కాపాడుకోండిలా..



రక్తాన్ని శుద్ధి చేయడం, శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపడంలాంటి ప్రధానమైన పనులెన్నింటినో చేసే కాలేయాన్ని మనం మాత్రం సరిగ్గా పట్టించుకోం. కానీ లివర్ ఆరోగ్యంగా ఉంటేనే మనం కులాసాగా ఉండగలం. కాలేయ వ్యాధుల వల్ల ఏటా 20 లక్షల మంది చనిపోతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి కూడా. అలాగని దాన్ని జాగ్రత్తగా చూసుకోవడానికి మనం మరీ కష్టపడనక్కర్లేదు%ౌ% ఈ చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే సరి! చురుగ్గా ఉండండి: రోజువారీ వ్యాయామాలు చేయడం, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం ద్వారా లివర్‌ను కాపాడుకోవచ్చు. నడక, పరిగెత్తడంలాంటి సాధారణ వ్యాయామాలు చేసినా కూడా ఫ్యాటీ లివర్ వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చట. జపాన్‌లోని ఒక విశ్వవిద్యాలయం చేసిన అధ్యయనంలో వ్యాయామం చేసే వారిలో వివిధ లివర్ వ్యాధులు 9.5 శాతం నుంచి 16.4 శాతం దాకా తగ్గాయని వెల్లడైంది.

గుప్పెడు గింజలు: వాల్‌నట్, బాదంలాంటి గింజలు కాలేయం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఉదయం పూట ఏదో ఒక సమయంలో గుప్పెడు గింజలు (దాదాపు 28 గ్రా.) తింటే నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌ని అరికట్టవచ్చని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. అంటే, మద్యపానం సేవించని వారిలో వచ్చే ఫ్యాటీ లివర్ డిసీజ్ అన్నమాట. ఈ గింజల్లో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, విటమిన్–ఇ లాంటివి లివర్ బాగుండేందుకు తోడ్పడతాయి.

పరిశుభ్రత: కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పరిశుభ్రత ముఖ్యమైన అంశం. బాత్రూంకి వెళ్లి వచ్చాక, వంట చేసే ముందు, తినే ముందు చేతుల్ని 20 సెకన్ల పాటు శుభ్రంగా కడగడం ద్వారా హెపటైటిస్ ఎ, బి వైరస్‌ల బారిన పడకుండా ఉండొచ్చు. ఈ వైరస్‌లు కాలేయాన్ని దెబ్బతీస్తాయి. ఓ కప్పు బ్లాక్ కాఫీ: రోజూ కాఫీ తాగడం ద్వారా కూడా లివర్ వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చు. 2021లో చేసిన ఒక అధ్యయనం ప్రకారం తరచూ కాఫీ తాగే వారిలో క్రానిక్ లివర్ డిసీజ్ వచ్చే అవకాశం 21 శాతం, ఫ్యాటీ లివర్ ప్రమాదం 20 శాతం, క్రానిక్ లివర్ డిసీజ్ వల్ల చనిపోయే ప్రమాదం 49 శాతం వరకూ తగ్గినట్టు వెల్లడైంది. రోజుకు మూడు కప్పుల దాకా కాఫీ తాగొచ్చు కానీ, అందులో పాలు, చక్కెరలు మాత్రం ఉండకూడదట.

# పారా త్రో బాల్ ఇండియా సారధిగా ధీరావత్ మహేష్

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, ప్రతినిధి అక్టోబర్ 14 : మూడు చింతలపల్లి: మున్సిపాలిటీ లింగాపూర్ తండాకు చెందిన దిరావత్ మహేష్ పారా త్రోబాల్ ఇండియా టీం కెప్టెన్ గా సెలెక్ట్ అయ్యాడు. డిసెంబర్ 6 తేదీ నుండి శ్రీలంక లోని రత్నపురలో జరిగే మొట్టమొదటి సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్షిప్ పోటీలకు భారత జట్టు సారధిగా వ్యవహరించనున్నాడు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో భారత జట్టు కెప్టెన్ గా ఎంపిక చేసిన పారా త్రో బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రేమ్ కుమార్,కోచ్ సింగారపు బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు. సౌత్ ఏషియన్ టోర్నమెంట్ లో రాణించి భారత పతాకాన్ని రెపరెపలాడిస్తామని తెలిపారు. నాకు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహిస్తున్న నా తల్లిదండ్రులు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

# సినిమా..

## వార్ 2 ఫెయిల్యూర్ తర్వాత కియారా అద్వానీకి ఎదురుదెబ్బలు



బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారారు. భారీ అంచనాలతో విడుదలైన వార్ 2 సినిమా బాక్సాఫీస్ వద్ద దారుణంగా విఫలమవడంతో, కియారాకు భవిష్యత్ ప్రాజెక్టుల విషయంలో అనేక అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నట్లు సమాచారం. హృతిక్ రోషన్ - ఎన్టీఆర్ మల్టీస్టారర్ గా తెరకెక్కిన వార్ 2 చిత్రం ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదలై మొదటి వీకెండ్ వరకూ చక్కటి కలెక్షన్లను రాబట్టింది. అయితే ఆ తర్వాత కలెక్షన్స్ డ్రాప్ కావడంతో భారీ నష్టాలు మిగిలాయి. ఇదే సమయంలో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ చిత్రం డిజాస్టర్ కావడంతో అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. వార్ 2 విఫలమైన తర్వాత YRF స్పై యూనివర్స్ ప్రాజెక్టులపై మళ్లీ వ్యూహాలు పునః సమీక్షించబడుతున్నాయని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. కియారా అద్వానీతో వైఆర్‌ఎఫ్ మూడు సినిమాల డీల్ చేసినట్లు సమాచారం. స్పై యూనివర్స్ లో ప్రధాన మహిళా పాత్రల కోసం ఆమెను ఎంపిక చేసినప్పటికీ, తాజా ఫలితంతో ఆ కాంట్రాక్ట్ రద్దు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వార్ 2 చిత్రంలో కియారా తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కెరీర్‌లో తొలిసారి బికినీ లుక్ లో కనిపించారు. కానీ కథా బలం లేకపోవడంతో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడంలో సినిమా విఫలమైంది. ఫలితంగా కియారాపై విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల తల్లి అయిన కియారా, ప్రస్తుతం మేటర్నిటీ బ్రేక్ తీసుకున్నారు. ఈ కారణంగా కూడా ఆమె కొత్త సినిమాలకు కొంత విరామం ఇచ్చారు. ఇండస్ట్రీలో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, వైఆర్‌ఎఫ్ సంస్థ స్పై యూనివర్స్‌లో తదుపరి ప్రాజెక్టులకు కొత్త భామలని ఎంపిక చేయాలని చూస్తుందనే టాక్ వినిపిస్తుంది. వార్ 2 పరాజయం తర్వాత బాలీవుడ్ లో హై బడ్జెట్ యాక్షన్ సినిమాలపై మరోసారి సమీక్ష ప్రారంభమైందని తెలుస్తోంది. ప్రేక్షకులు కొత్త కథలు, లోతైన భావోద్వేగాలు కోరుకుంటున్నారు అని నిర్మాతలు విశ్లేషిస్తున్నారు. తారల గ్లామర్ మాత్రమే కాదు, కథకు బలం అవసరం అనే విషయాన్ని ఈ ఫలితం మళ్లీ రుజువు చేసింది. మరి వార్ 2 ఫెయిల్యూర్ కియారాకు ఎంత వరకూ ఇబ్బంది కలిగిస్తుందో వేచి చూడాల్సిందే. YRF అధికారికంగా కాంట్రాక్ట్ గురించి ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ, బాలీవుడ్ బిజినెస్ వర్గాల్లో గుసగుసలు

## విశ్వక్ సేన్‌తో నిహారిక రొమాంటిక్ మూమెంట్..






టాలీవుడ్‌లో మెగా కుటుంబం గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. చిరంజీవి మెగాస్టార్‌గా ఓ వెలుగు వెలుగుతుండగా, ఆయన బాటలో ఇండస్ట్రీకి వచ్చిన చాలా మంది హీరోలు అశేష ప్రేక్షకాదరణ సంపాదించారు. ఈ ఫ్యామిలీ నుండి హీరోలు చాలా మంది ఇండస్ట్రీకి వచ్చిన హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది మాత్రం మెగా డాటర్ నిహారిక కొణిదెల మాత్రమే. తొలుత యాంకర్‌గా రాణించిన ఈ భామ హీరోయిన్‌గా పలు సినిమాల్లో నటించినా పెద్దగా విజయాలను అం దుకోలే కపోయింది. అయితే ఇటీవల నిర్మాతగా మారిన ఆమెకు ఆ రంగంలో మంచి విజయం దక్కింది. ప్రస్తుతం సినిమాలతో పాటు నిర్మాతగాకూడా బిజీగా గడుపుతోంది. ఇలాంటి సమయంలో నిహారిక, టాలీవు డ్ యంగ్ హీరో విశ్వక్ సేన్‌తో కలిసి ఉన్న ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో ఇద్దరూ రొమాంటి క్‌గా కనిపించడంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. “ఇది ఎప్పుడు షూట్ చేశారు?”, “ఇద్దరికీ ముందే పరిచయం ఉందా?” అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అయితే ఆ వీడియో చూస్తే ఇద్దరూ సినీ ఇండస్ట్రీలోకి రాకముందు చేసిన వీడియో అని అర్థమవుతోంది. అయినప్పటికీ ఈ పాతవీడియో మళ్లీబయటకురావడంతో అభిమాను ల్లో పెద్ద చర్చకు దారితీసింది. గమనించదగ్గ విషయం ఏమిటంటే, నిహారిక కాలేజీ రోజుల్లో విశ్వక్ సేన్‌కు సీనియర్‌గా ఉన్నట్టు ఒక సినిమా ఈవెంట్‌లో చెప్పింది. ఇప్పుడు ఆ సీనియర్–జూనియర్ జంట వీడియో సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతూ హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం విశ్వక్ సేన్ టాలీవుడ్ యువ హీరోలలో వన్ ఆఫ్ ది బెస్ట్‌గా హీరోగా ఉన్నాడు. మనోడు ఎంతో డెడికేషన్‌తో సినిమాలు చేస్తున్నా కూడా సరైన సక్సెస్‌లు రావడం లేదు. దీంతో ఆయన ఫ్యాన్స్ కూడా నిరాశలో ఉన్నారు. తదుపరి చిత్రంతో అయిన విశ్వక్ సేన్ హిట్ కొట్టాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

## యాక్టింగ్‌లో ఆ ఇద్దరు మాస్టర్స్..!



షరతులచిట్టా విప్పి సందీప్‌రెడ్డి వంగా ఆగ్రహానికి గురై ‘స్పిరిట్’ అవకా శాన్ని చేజార్చుకున్న బాలీవుడ్ భామ దీపికా పదుకొనే.. రీసెంట్‌గా అల్లుఅర్జున్, అట్లీ సినిమాకు సైన్‌చేసింది. దాంతో ఒకచోట పోగొట్టుకున్న అవకాశం మరోచోట దక్కినట్టయ్యింది ఈ అందాలభామకు. ‘కల్కి 2898ఏడీ’లో ప్రభాస్.. అట్లీ సినిమాతో బన్నీ.. ప్రస్తుతానికి టాలీవుడ్‌కిచెందిన ఇద్దరు అగ్రహీరోలు కవర్ అయిపోయారు. అయితే.. దీపికా తీరు చూస్తుంటే వీరిద్దరితో ఆగేలా లేదు. టాలీవుడ్ అంతా కవర్ చేసేందుకు ప్రణాళికలే రచిస్తున్నట్టుంది ఈ బెంగళూరు భామ. రీసెంట్‌గా ఓఇంటర్వ్యూలో ‘నేను టాలీవుడ్‌లో మహేష్, తారక్‌ల అభిమానిని. వారిద్దరూ నటనలో మాస్టర్స్. వారితో కలిసి నటించాలనుంది.’ అంటూ పేర్కొన్నది. దీపికా నోటి వెంట మహేష్, తారక్‌ల ప్రస్తావనరావడం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైం ది. గతంలోటాలీవుడ్‌లో మీకెవరు తెలుసు? అనడిగితే ‘మహేష్’ అని అదోలా నవ్వుతూ.. మిగతా హీరోలెవరూ తెలీనట్టు ప్రవర్తించిన దీపిక.. ఇప్పుడు టాలీవుడ్ హీరోలకు భజన చేయడం చూసి.. ‘మార్పు మంచిదే’ అంటూ వెటకారంగా కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు.

## అతను అమ్మాయిల పిచ్చోడు..





వైల్డ్ కార్డ్ ఎంట్రీతో కలకలలాడుతోంది. మొత్తం ఇంట్లో 16 మంది కంటెస్టెంట్స్ ఉండగా.. వైల్డ్ కార్డ్ ద్వారా వచ్చిన వారు మొదటి రోజే ఆట మొదలెట్టారు. పాత కంటెస్టెంట్స్ కంటే ఎక్కువ పాపులారిటీ, ప్రేక్షకుల దృష్టిలో పడేందుకు తెగ ట్రై చేస్తున్నారు. ఇక వచ్చిరాగానే దివ్వెల మాధురి కళ్యాణ్‌తో గొడవ పెట్టుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆమె కన్నీరు పెట్టుకుని అందరికీ ట్విస్ట్ ఇచ్చింది. ఇక ఈ విషయంపై పికిల్స్ పాప , దివ్వెల మాధురి చర్చించుకున్నారు. ఈక్రమంలోనే రమ్య మోక్ష సంచలన వ్యాఖ్యలు చేసింది. సోమవారం జరిగిన ఎపిసోడ్‌లో భాగంగా..రమ్య మాట్లాడుతూ.. కళ్యాణ్ అమ్మాయిల పిచ్చోడు.. అతని ప్రవర్తన వేరేలా ఉంటుంది. తనూజ పై చేతులు వేసి తడుమతుంటే నాకే ఏదోలా ఉంది. అదే విధంగా నాతో ప్రవర్తిస్తే లాగిపెట్టి ఒక్కటి ఇచ్చేస్తా.. కిందేసి తొక్కేస్తా. ఈ విషయంలో తనూజ ఎందుకు ఊరుకుంటుందో తెలియడం లేదు. కళ్యాణ్‌ను కూడా ఆమె ఆపడం లేదు. రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు.. వారిద్దరు కాంబినేషన్ ఏంటో అర్థం కాదు అనగా.. దానికి దివ్వెల మాధురి అవును కళ్యాణ్ తన ప్రొఫెషన్ ఏంటో కూడా మర్చిపోయి ఇలా అమ్మాయిలతో చేస్తున్న బిహేవియర్ బాగాలేదు అని అంటుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. ఇది తెలిసి రమ్యపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## విడాకుల రూమర్స్.. జీవితం ఎన్నో పాఠాలు నేర్పింది: హన్సిక

హన్సిక మోత్వాని.. ఈ మధ్యకాలంలో ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్న పేరు.. ఈ హీరోయిన్ భర్తతో విడాకులు తీసుకోబోతుంది అనే రూమర్స్ తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. అయితే అలాంటి హన్సిక తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో ఒక సంచలన పోస్ట్ పెట్టింది. అయితే విడాకుల వార్తలు వినిపిస్తున్న వేళ హన్సిక ఇలాంటి ఒక పోస్ట్ పెట్టడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. మరి ఇంతకీ హన్సిక పెట్టిన ఆ పోస్ట్ లో ఏముంది అనేది ఇప్పుడు తెలుసుకుందాం. తాజాగా హన్సిక మోత్వాని బర్త్డే కావడంతో ఆమె తన అభిమానులు, సెలబ్రిటీలు, కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ వీళ్ళందరి నుండి వచ్చిన విషెష్ కి రిప్లై ఇస్తూ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. ఇక ఆ పోస్టులో ఏముందంటే.. “ఈ సంవత్సరం నా జీవితం నేను అడగకుండానే నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. నాలో ఏదో తెలియని బలం ఉంది అనే విషయాన్ని కూడా బయట పెట్టింది. నా బర్త్ డే రోజున మీ అందరి శుభాకాంక్షలుతో నా హృదయం ఉప్పొంగిపోతోంది.. నా మనసు చాలా ప్రశాంతంగా ఉంది.

## రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను.. డ్యూడ్ సినిమాపై మమితా బైజు

కోలీవుడ్ యంగ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ప్రదీప్ రంగనాథన్ నటిస్తోన్ చిత్రాల్లో ఒకటి డ్యూడ్. ఈ మూవీలో మమితాబైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అక్టోబర్ 17న విడుదల చేయనున్నారు. ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. ఈ సందర్భంగా మమితాబైజు ఆసక్తికర కామెంట్స్ చేసింది. కథలో ఉన్న కొత్తదనం వల్ల ఈ సినిమాకు ఒకే చెప్పానంది మమితా బైజు. కీర్తీశ్వరన్ చెప్పిన కాన్సెప్ట్ చాలా ఎక్జయిటింగ్‌గా, కొత్తగా అనిపించింది. నా పాత్ర కునాల్ కథలో చాలా కీలకంగా ఉంటుంది. నేను ఇదివరకెన్నడూ చేయని విధంగా ఉంటుంది. నా పాత్ర చాలా చాలెంజింగ్‌గా సాగుతుంది. కొన్ని సన్నివేశాలు భావోద్వేగపూరితంగా ఉంటాయి. ఆ సన్నివేశాల కోసం నేను రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. కానీ సెట్‌లో మాత్రం పూర్తిగా పర్‌ఫార్మెన్స్ పైనే ఫోకస్ పెట్టా. నా మీద ఎలాంటి ఒత్తిడి పడలేదు. నేను ప్రతీ సారి పూర్తిగా ప్రిపేరై వెళ్లేది. ఇది నాకు చాలెంజింగ్‌గా, రివార్డులా అనిపించిందని చెప్పుకొచ్చింది. ఇక కోస్టార్ ప్రదీప్ రంగనాథన్ గురించి మాట్లాడుతూ.. సెట్‌లో ప్రదీప్‌తో ఉన్నపుడు ఫన్‌గా ఉండేది.. తేలికగా అనిపించేది.. చాలా సహజసిద్ధమైన ఎనర్జీతో ప్రతీ సీన్‌ను పండించేలా చేసేవాడు. ఒక అర్థవంతమైన కోర్ పాయింట్‌తోపాటు ఫన్‌గా సాగుతుంది. డ్యూడ్ సినిమా కథ అన్ని రకాల వయస్సుల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఉంటుందని చెప్పుకొచ్చింది.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215